**నేటి కందం- నేటికి అందం**

కని పెంచి పెద్ద చేసిన
కనిపించెడి దేవతయగు కరుణామూర్తిన్
జననీ దినోత్సవంబున
మనమున దలచంగ వలయు మనదగు తల్లిన్ !!

మే నెల రెండవ ఆదివారమైన ఈరోజును
మనం ప్రపంచ మాతృమూర్తుల దినోత్సవం గా
జరుపుకుంటూ అందరు తల్లులకు నమస్కరిద్దాం



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

మతద్వేషం ఆక్టోపస్ గా
మారుతున్న వైనం
పవర్ రాజకీయంగా
ప్రతీ చోటుకు పయనం
ప్రజలు భ్రమల్లో ఉంటే
ప్రతీ హక్కు భోజ్యం
ప్రజాస్వామ్య లౌకికత్వం
ప్రమాదంగా రాజ్యం

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 10-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:214 పేజీలు:6 వెల: రూ.1/-

## విజయ్‌కు లైన్ క్లియర్.. మద్దతు లేఖ అందజేసిన వీసీకే



చెన్నై, మే 9: విజయ్ టీవీకే ఎట్టకేలకు ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ సాధించింది. టీవీకేకు బేషరతుగా తమ మద్దతును వీసీకే అధ్యక్షుడు తొల్ తురుమావళవన్ అధికారికంగా ప్రకటించారు. మద్దతు లేఖను స్వయంగా టీవీకేకు అందజేశారు. దీంతో తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం అవసరమైన 118 మంది సభ్యుల సంఖ్యాబలం టీవీకేకు చేకూరింది.

కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో టీవీకే బలం 116కు చేరుకోవడం, మరో ఇద్దరు ఎమ్మెల్యేల బలం అవసరం కావడంతో శుక్రవారం రాత్రి నుంచి ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. దీనికి ముందు పూర్తి సంఖ్యా బలంతో తమ వద్దకు రావాలని గవర్నర్ ఆర్లేకర్ స్పష్టం చేయడంతో మూడుసార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు నిరాశ ఎదురైంది. సంఖ్యాబలం నిరూపించుకోవడానికి ఈనెల 10 తేదీ గడువు కావడంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో వీసీకే మద్దతు అనివార్యమైంది. ఎట్టకేలకు బేషరుతుగా టీవీకేకు మద్దతిస్తున్నట్టు వీసీకే ప్రకటించడంతో విజయ్ పార్టీ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.

గవర్నర్‌ను కలవనున్న విజయ్

వీసీకే మద్దతుతో మ్యాజిక్ ఫిగర్ సాధించిన విజయ్ నేరుగా గవర్నర్‌ను మరోసారి కలవనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతారు. గవర్నర్ నుంచి ఆహ్వానం అందగానే ఏమాత్రం జాప్యం లేకుండా ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ రాక.. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, మే 09: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు (ఆదివారం) భాగ్య నగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ రేపు మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు.

ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు.

సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

## నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియామకం

న్యూ ఢిల్లీ, మే 9:భారతీయ నౌకాదళం తదుపరి చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. నావీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. దినేశ్ త్రిపాఠి పదవీకాలం మే 31వ తేదీన ముగియనున్నది. వెస్ట్రన్ నావెల్ కమాండ్‌లో ప్రస్తుతం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా స్వామినాథన్ చేస్తున్నారు. నావల్ స్టాఫ్‌కు చీఫ్‌గా కూడా స్వామినాథన్‌ను ప్రభుత్వ నియమించింది. రక్షణ శాఖ దీనిపై ప్రకటన చేసింది. 1987 జూలై 1వ తేదీన భారతీయ నౌకాదళంలో ఫ్లాగ్ ఆఫీసర్‌గా స్వామినాథన్ చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ యుద్ధంలో ఆయనకు ప్రత్యేకత ఉన్నది.

ఖదకవసలలో ఉన్న నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చదివారు. బ్రిటన్‌లోని శ్రీవెనహంలో ఉన్న జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజీలో చదివారు. మహారాష్ట్రలోని కరంజా జిల్లాలో ఉన్న కాలేజ్ ఆఫ్ నావెల్ వార్‌ఫేర్‌లో ఉన్న గడిపారు. అమెరికా నివ్‌పోర్ట్‌లో ఉన్న నావల్ వార్ కాలేజ్‌లో కూడా చదివారు. పరమ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.నౌకాదళంలో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆపరేషనల్, స్టాఫ్, ట్రైనింగ్ అపాయింట్ చేపట్టారు. క్షిపణి సామర్థ్యం కలిగిన ఐఎన్ఎస్ విద్యుత్, వినాశ్ వెసల్స్‌ను కమాండ్ చేశాడు. మిస్సైల్ నౌక ఐఎన్ఎస్ కులిష్ , గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ మైసూరు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్య కూడా ఉన్నాయి.

## ఈనెల 18న శ్రీవారి ఆర్జిత సేవా ఆగస్టు నెల టికెట్ల కోటా విడుదల



తిరుపతి, మే 9: భక్తుల సౌకర్యార్థం టీటీడీ ( ఎఅ ) కల్పిస్తు?న్న నెలవారి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవ టికెట్ల తేదీని ప్రకటించింది. మూడు నెలల ముందుగా విడుదల చేసే ఆగస్టు టికెట్ల కోటాను ( ఒబీణబీబబి ఖబీనీబిజీ ) ఈనెల 18న ఉదయం ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నామని, ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం ఈనెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు వివరించారు. లాటరీలో ఎంపికైన భక్తులు ఈ నెల 20 నుంచి 22 వ తేదీ మధ్యాహ్నంలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయని వెల్లడించారు.

ఈనెల 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌స ఏవ ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు వాటి దర్శణ స్లాట్లకు సంబందించిన కోటాను విడుదల చేస్తామన్నారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక దర్శన కోటా విడుదల చేస్తామన్నారు.

ఈనెల 25న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ. 300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తామని వివరించారు. భక్తులు http://ttdevasthanams.ap.gov.in/ వెబ్‌సైట్‌లో మాత్రమే సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించారు.

## ఎలుకల మందు తాగి ఆటో నడిపిన డ్రైవర్.. దారి మధ్యలో ఆటో బోల్తా

సంగారెడ్డి, మే 09: జిల్లాలోని చౌటకూర్ వద్ద జాతీయ రహదారి 161పై శనివారం రోడ్డు ప్రమాదం చోటు జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆటో నడపడం.. ప్రమాదానికి దారితీసింది. మందు ప్రభావంతో ఆటోను కంట్రోల్ చేయలేక రోడ్డు పక్కన ఆరబోసిన వరి కుప్పలను ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడింది. సదరు ఆటో డ్రైవర్ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన అతను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని, ఎలుకల మందు తాగి ఆటో నడిపాడు. ఆటో చౌటకూర్ శివారులోకి రాగానే డ్రైవర్ అస్వస్థతకు గురవడంతో వాహనం నియంత్రణ కోల్పోయింది. రోడ్డుపైనే ఉన్న వరి కుప్పలపైకి దూసుకెళ్లడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీశారు. అతని వద్ద ఉన్న కాగితాలను పరిశీలించగా, తన ఆత్మహత్యాయత్నానికి కారణమైన కొందరు వ్యక్తుల పేర్లను అందులో రాసి ఉన్నట్లు గుర్తించారు. బాధితుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి (ఉఉఉ) తరలించారు. సమాచారం అందుకున్న పుల్కల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు, ఆ లేఖలో ఉన్న వ్యక్తుల వివరాలపై విచారణ చేస్తున్నారు.

### విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. మితిమీరిన వేగం ఇద్దరు యువతుల జీవితాల్లో విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం.. వేగంగా వచ్చిన ఒక టయోటా కారు.. ముందు వెళుతున్న థార్ కారును బలంగా ఢీకొట్టింది. అనంతరం నియంత్రణ కోల్పోయిన టయోటా కారు.. అదే సమయంలో రోడ్డు దాటుతున్న ఇద్దరు యువతులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అంజలి (19) అనే యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో యువతి పూజిత తీవ్రంగా గాయపడటంతో, స్థానికులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటనా స్థలానికి చేరుకున్న వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంనిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ఇసుక లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## CURE, PURE, RARE మోడల్‌తో తెలంగాణ అభివృద్ధి: సీఎం రేవంత్



హైదరాబాద్, మే 9: ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.

ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. CURE, PURE, RARE గా అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు CURE ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఖజఖీఇ ఏరియాను మాన్యుఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న RARE ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు.

తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ ఎా ఎ ా ఎా ల ు గా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## కేరళ సీఎం అభ్యర్థిపై కొనసాగుతున్న ఉత్కంఠ

న్యూఢిల్లీ, మే 9: కేరళ సీఎం ఎవరవుతారే విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. కేరళ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎంపిక పంచాయతీ ప్రస్తుతం ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి ఎవరనేది తేల్చేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు.

ప్రస్తుతం కేరళ సీఎం రేసులో వీడీ సతీశన్, రమేష్ చిన్నితలా, కేసీ వేణుగోపాల్ ఉన్నారు. ఇక ఖర్గే నివాసానికి కేరళ కాంగ్రెస్ ముఖ్యనేతలు కూడా చేరుకున్నారు.

ఇప్పటికే ఈ విషయమై ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని పరిశీలకులు సేకరించారు. అనంతరం, ఎమ్మెల్యేల అభిప్రాయాలపై అధిష్టానానికి నివేదిక ఇచ్చారు.

ఈ నేపథ్యంలో కేరళలో కీలకమైన నేతలతో చర్చించిన అనంతరం ఏఐసీసీ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. కేరళ సీఎం ఎవరనే దానిపై ఈరోజు సాయంత్రానికి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే.. సతీశన్, రమేశ్ చిన్నితలా, కేసీ వేణుగోపాల్‌కు మద్దతుగా రాష్ట్రంలో వారి మద్దతుదారులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ర్యాలీలు నిర్వహించడంతో పాటు అనేక ప్రాంతాల్లో తమ ప్రియతమ నాయకుల బిల్‌బోర్డులు, పోస్టర్లు ఏర్పాటు చేశారు.

## పశ్చిమ బెంగాల్ సీఎంగా ప్రమాణం చేసిన సువేందు అధికారి



కోల్‌కతా, మే 9: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి(రాబీలవనిటబీ ఒటప్ప్రతిఎజీతీతి) ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్య్రం తర్వాత బెంగాల్ రాష్ట్రానికి బీజేపీ పార్టీకి నుంచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి వ్యక్తిగా సువేందు రికార్డు క్రియేట్ చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన సీఎంలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సువేందు .. ప్రధాని మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. వేదికపై ఉన్న నేతలతో కరచాలనం చేశారు. సువేందు అధికారి బాధ్యతలు చేపట్టడంతో.. బెంగాల్‌లో కొత్త చరిత్ర లిఖితమైంది. చాన్నాళ్లుగా బెంగాల్‌పై పట్టు కోసం ప్రయత్నించిన బీజేపీ చివరకు విజయాన్ని సాధించింది. తాజా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 207 సీట్లు దక్కిన విషయం తెలిసిందే. దీంతో మమతా బెనర్జీ ఆధిపత్యానికి గండి పడింది.

బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 9వ వ్యక్తిగా సువేందు అధికారి నిలిచారు. సువేందు వయసు 55 ఏళ్లు. బెంగాల్ గ్రామీణ జిల్లాల్లో ఆయనకు మంచి పట్టు ఉన్నది. సువేందు అధికారి తండ్రి గతంలో కేంద్ర మంత్రిగా చేశారు. ఆయన పేరు సిసిర్ అధికారి. కాంగ్రెస్ స్టూడెంట్ వింగ్‌లో సువేందు తన కెరీర్‌ను మొదలుపెట్టారు. బెంగాల్‌లో వామపక్షాల ఆధిపత్యం ఉన్న సమయంలో.. ఛాత్ర పరిషత్‌లో సువేందు కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత ఆయన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీలో చేరడానికి ముందు దీదీకి చాలా నమ్మకస్తుడిగా ఉన్నారు. ఆ తర్వాత ఆయన మమతా బెనర్జీకి ప్రధాన ప్రత్యర్థిగా తయారయ్యారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 207 సీట్లలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే రెండు సార్లు దీదీపై పోటీ చేసి సువేందు నెగ్గారు.

## యూపీ మంత్రివర్గ విస్తరణ... గవర్నర్‌ను కలవనున్న యోగి ఆదిత్యనాథ్



లక్నో, మే 9: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ జరుగనుందనే ఊహాగానాల నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శనివారం సాయంత్ర 6.30 గంటలకు గవర్నర్ ఆనందిబెన్ పటేల్‌ను కలుసుకోనున్నారు. మంత్రివర్గ విస్తరణలో కొత్తగా ఆరుగురికి చోటు కల్పించే అవకాశం ఉంది.

యూపీ క్యాబినెట్‌లో మొత్తం 60 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులుతో కలిసి 54 మంది ఉన్నారు. వీరిలో 21 మంది క్యాబినెట్ మంత్రులు, 14 మంది స్వతంత్ర హోదా కలిగిన మంత్రులు, 19 మంది సహాయ మంత్రులు ఉన్నారు. దీంతో కొత్తగా ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించే వీలుంది. మంత్రివర్గం నుంచి పలువురిని తప్పించాలని తొలుత పార్టీ అధిష్టానం ఆలోచన చేసిందని, అయితే ఇప్పుడు ఆ ఆలోచన విరమించుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా మంత్రివర్గంలో చోటు కల్పించే ఆరుగురిలో కృష్ణ పాశ్వాన్, సమాజ్‌వాదీ పార్టీ రెబల్ ఎమ్మెల్యే పూజా పాల్, మనోజ్ పాండే, భూపేంద్ర చౌదరి, అశోక్ కటారియా, రోమి సహాని ఉంటారని తెలుస్తోంది.

యోగి ఆదిత్యనాథ్ 2022లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. 2024 మార్చిలో తొలిసారి క్యాబినెట్ విస్తరణ జరిపారు. కాగా, 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ప్రాంతాలు, కులాల సమీకరణలను దృష్టిలో ఉంచుకుని తాజా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం ఉందా !

## (10 మే "జాతీయ మాతృ దినోత్సవం" సందర్భంగా)

అమ్మ లేని జన్మ లేదు. అమ్మే కదా ఆది గురువు. అమ్మ పదానికి వైరి లేరు. అమ్మ అంటే దైవ సమానం. అమ్మను తలవని రోజు లేదు. అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదు. అమ్మ పాల కన్న పోషకాహారం లేదు. అమ్మ లేని బతుకు లేదు. అమ్మ దీవెన కన్న అమూల్యమైంది లేదు. నా జన్మకు తను పునర్జన్మను పొంది, నా నవ్వులకు తానే ఇంధనం వలె కరిగి, నా తొలి పలుకులకు ఆది గురువై, నా ఆకలి తెలిసిన ఏకైక అమృత హస్తమై, నా చిరునవ్వులతోనే తాను కడుపు నింపుకుంటూ నా నీడలా నిలిచింది అమ్మ. కుటుంబాన్ని ఏకం చేసే మహాశక్తి అమ్మ. ఇంటి గడపకు పూసిన పసుపు పారాణి అమ్మ. అన్నామృత వర్షిణి అమ్మ. బొడ్డు పేగు బంధం రుచి చూపినా, మమతానురాగాలు పంచినా, ఇసుమంతైనా కృతజ్ఞతను ఆశించని అపురూప దేవత అమ్మ. ఆమె చల్లని ఒడి, ప్రశాంతతను పంచే గుడి. పిల్లల గుండెల్లో కొలువైన దేవత అమ్మ. పిల్లల ముఖాల్లో నవ్వుల పువ్వులు పూయించగ నేర్పరి అమ్మ. 'అమ్మ' అనే మాట అనిర్వచనీయమైన ఓ అద్భుత భావన. అమ్మ హృదయం హిమాయమంత చల్లదనం. ఆవేశమెరుగక బేషరతుగా ప్రేమలు పంచే అమాయక త్యాగశీలి అమ్మ. అపురూప ప్రేమకు ప్రతిరూపమే అమ్మ. అమ్మ ప్రేమ, అమ్మ రొమ్ము పాలు అత్యంత స్వచ్ఛమైనవి. పిల్లల ఉనికి, పిల్లల ఊపిరి అమ్మే. అమ్మకు అభయహస్తం నాన్న. అమ్మ ప్రేమను తత్‌సమానం లేదు.

### జాతీయ మాతృ దినోత్సవం:

ఆకాశమంత అనురాగం, అంతరిక్షమంత సహనం, ఎవరెస్టుతో వ్యక్తిత్వం, మహోన్నత ప్రేమ శిఖరం అమ్మ. మాతృమూర్తి త్యాగానికి ప్రత్యామ్నాయం లేదు. అమ్మను నిత్యం మనసులో కొలుచుకున్నప్పటికీ ప్రతి ఏట మే మాసం 2వ ఆదివారం, అనగా 10 మే 2026 రోజున ప్రపంచవ్యాప్తంగా "జాతీయ మాతృదినోత్సవం" లేదా "నేషనల్ మదర్స్ డే" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. జాతీయ మాతృ దినోత్సవం –2026 ఇతివృత్తంగా "గొప్ప భారం దించడం" అనబడే అంశాన్ని తీసుకొని తల్లి మోస్తున్న భారీ మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వహించాలని ప్రచారం చేస్తున్నారు. 1914లో అమెరికన్ అన్నా జార్విస్ ప్రారంభించిన మాతృ దినోత్సవం రోజుల ప్రతి ఒక్కరు తమ అమ్మ పాదాల చెంతకు చేరి, పాదాలకు నమస్కరించి, ఆమె అమూల్య దీవెనలు పొంది అమ్మ ముఖంలో స్వచ్ఛమైన నవ్వులను చూద్దాం. మాతృదినోత్సవ శుభవేళ అమ్మతో విహారయాత్ర, కలిసి వంట చేయడం, చిన్నపాటి ఫోటో ఆల్బంను అమ్మ ఒడిలో పడుకొని చూడడం, లాంగ్ డ్రైవ్ వెళ్లడం, రోజంతా కలిసి గడపడం, అమ్మకు నచ్చిన బహుమతులు లేదా గ్రీటింగ్ కార్డులు ఇవ్వడం లాంటివి చేయవచ్చు. అమ్మతో గడపడం అసాధ్యం అయిన సందర్భాల్లో వీడియో మెసేజ్ పంపడం, ఈ-గ్రీటింగ్ కార్డులు పంపడం, అమ్మకు ఇష్టమైన పూలతో బొకే పంపడం, డిజిటల్ ఫోటో ఫ్రేమ్‌లు పంపడం చేయవచ్చు.

### తల్లి రుణం తీర్చుకోలేనిది:

అమ్మ ప్రేమను వ్యక్తం చేయడానికి అక్షరాలు చాలవు. నవమాసాలు మోసి, ప్రసవ వేదన భరించి, ఆలనాపాలనా చూసి, అన్నీ తానై సేవలు చేసిన తల్లికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. మన ముందు నిలిచిన ఆది దేవుళ్లు అమ్మానాన్నలు మాత్రమే. నిస్వార్థతకు, నిజాయితీ కలిగిన ప్రేమకు, కొండంత త్యాగశీలతకు, అనిర్వచనీయ సురక్ష కవచాన్ని నిర్మించడానికి నిలువెత్తు నిదర్శనం అమ్మ. అమ్మకు పదవి విరమణ లేదు. పిల్లల కోసం తపించని రోజు ఉండదు. పిల్లల సేవలో అలసట ఎరుగదు. అమ్మ చనుబాల కన్న అమృతం లేదు. అమ్మ చేతి ముద్ద కన్న రుచి మరొకటి లేదు. బిడ్డ జీవితంలో ఉపాధ్యాయురాలు పాఠ్యాంశాలను నేర్పితే, అనంతజ్ఞాని వలె అమ్మ జీవిత పాఠాలను నేర్పుతుంది. బిడ్డకు తడబడే బుడిబుడి తొలి అడుగులు వేయడం నేర్పుతుంది. నిరక్షరాస్యులు తానైన అనంత లోకజ్ఞానాన్ని అమ్మ నూరి పోస్తుంది, తొలి పలుకులు నేర్పుతుంది. కలికాలం సుఖ సంతోషాలతో ఉండమని దీవిస్తుంది, దాని కోసం ఆరాటపోరాటాలు చేస్తుంది. అమ్మ కొంగు బిడ్డకు ఊతకర్ర, కొండంత అండ. చంక నెత్తుకొని లోకాన్ని పరిచయం చేస్తుంది. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అన్న పెద్దలు సైతం తొలి గౌరవం అమ్మకే ఇచ్చారు. కింద పడిన ప్రతి సారి లేచి నడవమని చెప్పకనే జీవన పోరాటాన్ని నేర్పుతుంది. తల్లి నిస్వార్థ ప్రేమకు ప్రతీక. పిల్లల ఆనందమే తన ఆనందంగా భావిస్తూ, మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తుంది అమ్మ. దయ, కరుణ, త్యాగం, నిస్వార్థం, ప్రేమల నిలువెత్తు కలబోత అమ్మ. పదాలు తెలియని పెదవులకు అమృత వాక్యం అమ్మ. అమ్మ చల్లని ఒడిలో మొదలైన జన్మ ఆసాంతం గెలుపోటముల తాపాల మిశ్రమమే. అనేక రకాల ప్రేమల్లో స్వచ్ఛమైనది తల్లి ప్రేమ. అమ్మంటే త్యాగమే కాదు, ఓ విలక్షణ వ్యక్తిత్వం, ఆశావహ దృక్కోణం. అమ్మ ఓ అనంత విశ్వవిద్యాలయం, ఓ తడారని ప్రేమామృతం. మనం ఏడుస్తున్నప్పుడు ప్రసవ వేదన మరిచి అమ్మ సంతోషపడే క్షణాలు మనం పుట్టిన తొలి గడియలు మాత్రమే. అమ్మ కడుపు చల్లగా, అమ్మ మనసు నిండుగా, అమ్మ ఒడి మెత్తగా, అమ్మ ప్రేమ స్వచ్ఛంగా ఉంటుందని మనందరికీ తెలుసు.

కాలం మారుతోంది. తరాలు మారుతున్నాయి. విలువలు కొత్త రూపం దాల్చుతున్నాయి. ప్రేమకు నిర్వచనం మారుతున్నది. స్నేహ భావాలు బలహీన పడుతున్నాయి. అను బంధాలు పతనం అవుతున్నాయి. అన్నీ సంపద చుట్టు తిరుగుతున్నాయి. కాని అమ్మ ప్రేమ మాత్రం కాలకాలం సుస్థిరం, శాశ్వతం. నేటి వేగవంతమైన జీవన పోరాటంలో అమ్మతో నిత్యం గడపడం భారత కుటుంబాల్లో సహితం అసాధ్యంగా తోస్తున్నది. అమ్మానాన్నలు విడాకులు తీసుకున్నా అమ్మ ప్రేమ మాత్రం చెక్కు చెదరని విలక్షణ అమూల్య నిధి. అమ్మను మది మందిరంలో ప్రతిష్టించుకొని, ఆమె దీవెనల మాటల మూటలను నెత్తిన పెట్టుకొని, అమ్మ ఆశయ సాధనకు కృషి చేద్దాం. అమ్మ ముఖంలో ఆనందాల సింగిడి వెలవడానికి మనం నేడే కారణం అవుదాం. అమ్మకు మనసారా కృతజ్ఞతల ప్రేమ పూల మాలలు వేద్దాం. అమ్మ నీ పాదాలకు వందనం, నీవు లేని మా బతుకు నిస్సారం.



-మధుపాళీ
9949700037

# భారత విమానాల అద్దె, ఫైనాన్సింగ్ సదస్సు 2.0

న్యూఢిల్లీ, మే 9: ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ), ఫిక్కీతో (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) కలిసి కేంద్ర ప్రభుత్వ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ) నిర్వహించిన 'భారత విమానాల అద్దె, ఫైనాన్సింగ్ సదస్సు 2.0 (ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ అండ్ ఫైనాన్సింగ్ సమ్మిట్- ఐఏఎల్ఎఫ్ఎస్ 2.0)' విజయవంతమైంది. గుజరాత్ గాంధీనగర్‌లోని గిఫ్ట్ సిటీ వేదికగా 2026 మే 8వ తేదీ శుక్రవారం నాడు ఇది జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

2025లో జరిగిన తొలి సదస్సు విజయవంతమవటంతో దాని కొనసాగింపుగా నిర్వహించిన ఐఏఎల్ఎఫ్ఎస్ 2.0.. విధాన రూపకర్తలు, ఆర్థిక రంగ నిపుణులు, విమానయాన రంగ ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. అంతర్జాతీయ వేదికగా ఎదుగుతున్న గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీపై ప్రత్యేక దృష్టితో విమానాల అద్దె, విమానయాన ఫైనాన్సింగ్ రంగాలలో దీని పాత్రను మరింత బలోపేతం చేయడంపై ఈ సదస్సులో చర్చించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. గిఫ్ట్ సిటీని ప్రపంచ ఆర్థిక, ఆర్థిక సాంకేతికత కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. కొత్త విమానాశ్రయాల అభివృద్ధి ప్రాజెక్టులతో సహా గుజరాత్‌లో పెరుగుతున్న విమానయాన మౌలిక సదుపాయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర విమానయాన వృద్ధి పథంలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ భాగస్వాములను ఆయన కోరారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌గానే కాకుండా విమానయాన ఫైనాన్సింగ్, అద్దె రంగాల్లో అంతర్జాతీయ స్థాయి అధికార పరిధి కలిగిన దేశంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో అన్ని రకాల విమాన విభాగాల్లో భారత వాణిజ్య విమానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన వృద్ధికి ఊతమివ్వడానికి దేశీయంగా పటిష్టమైన ఫైనాన్సింగ్, అద్దె వ్యవస్థను తయారు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా ప్రధానంగా పేర్కొన్నారు.

అద్దె రంగంలో ఉన్న అపారమైన అవకాశాల గురించి ఆయన మాట్లాడుతూ.. "భారత వాణిజ్య విమానాల సంఖ్య 2027 నాటికి 1,100కు చేరుకుంటుందని.. 2035 నాటికి అది 2,250 కంటే ఎక్కువకు పెరుగుతుందన్న అంచనా ఉంది. ప్రస్తుతం భారతీయ విమానయాన సంస్థలు 1,640 విమానాల కోసం ఆర్డర్లు పెట్టాయి. ఇది రాబోయే దశాబ్ద కాలంలో భారతదేశ అద్దె వ్యవస్థకు 50 బిలియన్ డాలర్ల మేర భారీ అవకాశాలను కల్పిస్తుంది" అని వ్యాఖ్యానించారు.

మొదటి 'విమానాల అద్దె, ఫైనాన్సింగ్ సదస్సు' తర్వాత నెరవేర్చిన ప్రధాన హామీలను శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యంగా 'ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్స్ ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆబ్జెక్ట్స్ (పీఐఏఓ) చట్టం- 2025' అమలు గురించి ఆయన ప్రస్తావించారు. కేప్ టౌన్ కన్వెన్షన్‌కు అనుగుణంగా భారత చట్ట వ్యవస్థలో తీసుకొచ్చిన ఒక కీలక సంస్కరణగా దీనిని ఆయన అభివర్ణించారు. "చాలా ఏళ్లుగా అద్దెకు ఇచ్చే సంస్థలు (లెస్సర్లు) ఐడీఈఆర్ఏ హక్కులను వినియోగించుకోవడంలో సుదీర్ఘ జాప్యాన్ని ఎదుర్కొన్నాయి. దీని వల్ల భారతీయ విమానయాన సంస్థలపై ఖర్చుల భారం పెరిగి అంతిమంగా విమాన ప్రయాణికులపై అధిక ఛార్జీల రూపంలో ప్రభావం పడింది. ఇప్పుడు ఆ లోటు భర్తీ అయింది" అని ఆయన పేర్కొన్నారు.

మొదటి సదస్సు ముగింపులో ఇచ్చిన మరో కీలక హామీ అయిన.. లీజింగ్ ప్రక్రియ కోసం 'ఉన్నత స్థాయి వాటాదారుల కమిటీ' ఏర్పాటు కూడా పూర్తయిందని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

భారతీయ విమానయాన సంస్థల కార్యాచరణ స్థిరత్వం, దీర్ఘకాలిక వృద్ధిని నిర్ధారించడంలో ప్రభుత్వం నిరంతరం మద్దతు ఇస్తుందని కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ఉద్ఘాటించారు. విమానయాన ఇంధన (ఏటీఎఫ్) ధరల పెరుగుదలపై ప్రభుత్వం 25 శాతం పరిమితిని విధించిందని.. దేశవ్యాప్త విమానాశ్రయాలలో ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం తగ్గించిందని అన్నారు. విమానయాన సంస్థలకు రుణాల విషయంలో మద్దతు చర్యలను విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ.. విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న నగదు లభ్యత ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం రూ. 5,000 కోట్ల వ్యయంతో 'క్రెడిట్ లైన్ గ్యారెంటీ పథకానికి' ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. ప్రపంచంలోని మరే ఇతర ప్రభుత్వం కూడా ఇటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

ఐఎఫ్ఎస్‌సీఏ ఛైర్మన్ శ్రీ కే. రాజారామన్ మాట్లాడుతూ.. విమానాలను అద్దెకు ఇచ్చే సంస్థలు, విమాన ఇంజన్లు, హెలికాప్టర్లు, ఇతర విమానయాన ఆస్తులకు సంబంధించిన ఫైనాన్సింగ్ వేదికలకు ప్రస్తుతం గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ నిలయంగా ఉందని పేర్కొన్నారు. పన్ను మినహాయింపు గడువు పొడిగింపు, సింగిల్ విండో ఐటీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడం, ఎస్‌పీవీ- ట్రస్ట్‌లను ప్రవేశపెట్టడం వంటి కీలక సంస్కరణలు అంతర్జాతీయంగా ఆమోదం పొందిన ఫైనాన్సింగ్ నమూనాలకు పునాదులని ఆయన అన్నారు. తదుపరి దశలో నియంత్రణపరమైన వెసులుబాటు, విమానయాన ఆర్థిక విలువ గొలుసులో విస్తృత సంస్థాగత భాగస్వామ్యం ద్వారా ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పౌర విమానయాన శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. స్థిరమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఉద్ఘాటించారు. భారత విమానయాన వృద్ధి కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా యాజమాన్య హక్కులు, ఫైనాన్సింగ్, ఆర్థిక ఆవిష్కరణల దిశగా విస్తరిస్తోందని ఆయన అన్నారు. ఆర్థిక సంస్థలు, బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్‌లు, మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థల నుంచి దీర్ఘకాలిక దేశీయ మూలధనాన్ని విమానయాన రంగానికి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ప్రకటించారు.

పరిశ్రమ గురించి మాట్లాడిన ఫిక్కీ పౌర విమానయాన కమిటీ ఛైర్మన్, ఎయిర్‌బస్ భారత్- దక్షిణాసియా అధ్యక్షులు- ఎండీ శ్రీ జుర్గెన్ వెస్టర్‌మీర్.. భారత విమానయాన- ఏరోస్పేస్ రంగం భద్రత, అందుబాటు ధరలు, పోటీతత్వం, సుస్థిరతల ఆధారంగా ముందుకు సాగుతోందని అభిప్రాయపడ్డారు. భారతీయ విమానయాన సంస్థల వద్ద ఉన్న భారీ ఆర్డర్ బ్యాక్‌లాగ్, విమానాల కొనుగోలుకు అవసరమైన భారీ ఫైనాన్సింగ్ గురించి మాట్లాడుతూ.. రాబోయే కాలం అటు దేశీయ, ఇటు అంతర్జాతీయ ఫైనాన్సియర్లు, అద్దెకు ఇచ్చే సంస్థలకు గొప్ప అవకాశాలను అందిస్తుందన్నారు.

ఈ సదస్సులో పరిశ్రమకు సంబంధించిన కీలక ప్రకటనలు వెలువడ్డాయి. 'ఏఐ ఫ్లీట్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్‌సీ లిమిటెడ్' (ఎయిర్ ఇండియా) విమానాల పోర్ట్‌ఫోలియోను ప్రస్తుతం ఉన్న 50 నుంచి 2027 మార్చి నాటికి 76 విమానాలకు పెంచనున్నట్లు ప్రకటించింది. ఇదే కాలంలో తన విమానాల సంఖ్యను ప్రస్తుతమున్న సుమారు 75 నుంచి దాదాపు 150 విమానాలకు పెంచనున్నట్లు 'ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్‌సీ' (ఇండిగో) వెల్లడించింది.

గిఫ్ట్ సిటీలో 'ఆకాశ ఎయిర్ లీజింగ్ ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్' (ఏఏఎల్ఐ) అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆకాశ ఎయిర్ ప్రకటించింది. రాబోయే ఐదేళ్లలో సుమారు 60 విమానాలను లీజుకు తీసుకోవడం ద్వారా ఆకాశ ఎయిర్ విమానశ్రేణి విస్తరణకు గిఫ్ట్ సిటీలోని ఈ కార్యాలయం తోడ్పాటునందిస్తుంది.

మరోవైపు 2026 మేలో ఎంబ్రాయర్ ఈ190 విమానాలను లీజుకు తీసుకోవడం కోసం గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీలో 'ఘోడావత్ ఏవియేషన్ ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు స్టార్ ఎయిర్ ప్రకటించింది. 2027 ఆర్థిక సంవత్సరంలో గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ నుంచి మరో 6 నుంచి 8 ప్రాంతీయ విమానాలను అద్దెకు తీసుకోవాలని స్టార్ ఎయిర్ లక్ష్యంగా పెట్టుకుంది.

ఇటీవల సవరించిన 'ఐఎఫ్ఎస్‌సీఏ (టెక్‌ఫిన్, అనుబంధ సేవలు) నిబంధనలు- 2025' ప్రకారం 'ట్రస్ట్ అండ్ కంపెనీ సర్వీస్ ప్రొవైడర్' (టీసీఎస్‌పీ) హోదాలో గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ నుంచి విమానాల అద్దె కోసం ఎస్‌పీవీ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా అద్దెకిచ్చే సంస్థలకు సేవలు అందించనున్నట్లు విస్ట్రా ప్రకటించింది.

పౌర విమానయాన శాఖ (ఎంఓసీఏ), ఫిక్కీ సహకారంతో 'భారతదేశంలో విమానాల అద్దె వ్యవస్థను అభివృద్ధి చేయటం- సంస్కరణల నుంచి భవిష్యత్తు వృద్ధికి చోదక శక్తిగా' పేరుతో తయారు చేసిన నివేదికను కేపీఎంజీ విడుదల చేసింది.

అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా, విమానయాన ఫైనాన్స్‌కు ప్రపంచ స్థాయి కేంద్రంగా గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీని మార్చేందుకు ఐఎఫ్ఎస్‌సీఏ, ఫిక్కీ మధ్య అవగాహన ఒప్పందం కుదరడంతో ఈ ప్లీనరీ సెషన్ ముగిసింది.

గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీలో విమానాల అద్దె, విమానయాన ఫైనాన్సింగ్ వ్యవస్థ బలోపేతం చేయడంపై సెషన్లు:

విమానాల అద్దె- ఫైనాన్సింగ్, విమానయాన పెట్టుబడులకు గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీని ఒక పోటీతత్వ ప్రపంచ కేంద్రంగా బలోపేతం చేయడంపై ఈ సెషన్లు దృష్టి సారించాయి. ఈ చర్చల్లో విమానయాన సంస్థలు, కార్గో నిర్వహణ సంస్థలు, హెలికాప్టర్ ఆపరేటర్లు, అద్దెకు ఇచ్చే సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, న్యాయ నిపుణులు, పన్నులకు సంబంధించిన నిపుణులు, నియంత్రణ సంస్థలు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

భారతీయ వాయుయాన్ అధినియం, పీఐఓఏ చట్టం, అద్దె సంస్థలకు పన్ను ప్రయోజనాలను ఇవ్వటం, కార్పొరేట్ పన్ను రేట్ల తగ్గింపు వంటి కీలక సంస్కరణల ద్వారా పటిష్టమైన విమానయాన అద్దె వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతినిధులు అభినందించారు. నియంత్రణ, పన్ను పరమైన స్పష్టతను అందించేలా తీసుకున్న చర్యలను వారు కొనియాడారు. ఈ సంస్కరణలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా ఈ రంగంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేశాయని వారు అభిప్రాయపడ్డారు.

దేశీయ విమాన, ఇంజిన్ ఫైనాన్సింగ్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని.. నిధుల లభ్యతను మెరుగుపరచటంతో పాటు మరింత పోటీతత్వంతో కూడిన ఫైనాన్సింగ్ వాతావరణాన్ని సృష్టించాలని విమానయాన సంస్థలు, నిర్వహణ సంస్థలు ప్రధానంగా చెప్పాయి. నైపుణ్యమైన మానవ వనరుల లభ్యత, నిశ్చయమైన పన్నులు, డీటీఏఏ సంబంధిత స్పష్టత, దేశీయ విమాన ఫైనాన్సింగ్ సామర్థ్యాలు, ఆస్తుల ఆధారిత ఫైనాన్సింగ్ నమూనాల వైపు పరివర్తన వంటి అంశాలపై కూడా చర్చలు దృష్టి సారించాయి.

వీటితో పాటు కార్గో, హెలికాప్టర్ ఆపరేటింగ్ సంస్థలు.. కస్టమ్స్ విధానాలను సరళీకరించాలని, దిగుమతి ప్రక్రియలను సులభతరం చేయాలని, రంగాల వారీ సమస్యల పరిష్కారానికి అంకితమైన సంస్థాగత మద్దతు యంత్రాంగాల అవసరముందని విన్నవించాయి.

# ఘనంగా 90 వసంతాల ఆకాశవాణి వేడుకల నిర్వహణ

**–రేపు తుమ్మలపల్లి కళా క్షేత్రంలో**
**–స్వర సంధ్య మ్యూజికల్ కార్యక్రమం**
**–విశ్వసనీయతకు మారుపేరు ఆకాశవాణి**
**–నేటి తరానికీ స్ఫూర్తిదాయకం**

విజయవాడ, మే 9: ఆకాశవాణి 90 వసంతాల సందర్భంగా ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారని అందులో భాగంగా ఆకాశవాణి రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎమ్. సోమేశ్వరరావు, ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి జి. దివ్య, న్యూస్ విభాగాధిపతి టి. హెన్రీ రాజ్ లు శనివారం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎమ్. సోమేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలుగా ఆకాశవాణి విజయవాడ కేంద్రం సమాజంలోని ప్రతి వర్గానికి చేరువవుతూ విశిష్ట సేవలు అందిస్తోందన్నారు.




కళాకారులకు నిలయంగా, రైతులకు నేస్తంగా, యువతకు స్నేహితుడిగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎం.బాలమురళీకృష్ణ, కె.విశ్వనాథ్, గొల్లపూడి మారుతీరావు, కొంగర జగ్గయ్య వంటి దిగ్గజాలు తమ ప్రయాణాన్ని సాగించారన్నారు. విద్య, వ్యవసాయం, సాహిత్యం, సంగీత, సాంస్కృతిక రంగాల్లో విజ్ఞానదాయకమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తూ ఈ కేంద్రం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఆకాశవాణి కేవలం వార్తలకే పరిమితం కాకుండా కథలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్న రీతిలో ప్రజలకు అందిస్తోందన్నారు.

పాత తరం నుండి నేటి తరం వరకు అందరికీ చేరువయ్యేలా తన ప్రసార పద్ధతులను మార్చుకుంటూ, ప్రస్తుతం డిజిటల్ మోడ్‌లో కూడా ప్రసారాలను కొనసాగిస్తోంది. భారతదేశంలో సుమారు 585 స్టేషన్లతో, 92.5% ప్రజలకు మరియు 99.17% భౌగోళిక ప్రాంతానికి ఆకాశవాణి తన సేవలను విస్తరించిందన్నారు. ఆకాశవాణి అందించే వార్తలు అత్యంత వాస్తవమైనవని, నమ్మదగినవిగా గుర్తింపు పొందాయన్నారు. 1936లో మొదటి రేడియో స్టేషన్ ప్రారంభమైందని ఎమ్. సోమేశ్వరరావు పేర్కొన్నారు. ప్రోగ్రామ్ విభాగాధిపతి గుడుపూడి దివ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఆకాశవాణి 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు, జూన్ 8, 2025 నుండి జూన్ 8, 2026 వరకు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మే 10 (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సర్వేపల్లి సిస్టర్స్ గాత్ర కచేరీ, గరగ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు మే 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బహుమతులు అందిస్తావన్నారు. మే 19 ఉదయం 6:30 గంటలకు నగరంలో ప్రత్యేక వాకథాన్ నిర్వహిస్తున్నామన్నారు. వాస్తవమైన వార్తలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి ఆకాశవాణి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందన్నారు.

ప్రస్తుతం యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లోనూ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆకాశవాణి న్యూస్ విభాగాధిపతి హెన్రీ రాజ్ మాట్లాడుతూ మారుతున్న కాలంలో సమాచార విప్లవం ఎన్ని మలుపులు తిరిగినా, ఆకాశవాణి తన విశ్వసనీయతను, ప్రామాణికతను కాపాడుకుంటూనే ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియా, టీవీ ఛానళ్ల హడావిడిలో నేటి తరానికి ఆకాశవాణి విశిష్టతపై అవగాహన తగ్గుతోందని, దాని ప్రాముఖ్యతను చాటిచెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన కోరారు.

ఒకప్పుడు గడియారాల్లో సమయాన్ని సరిచేసుకోవడానికి ఆకాశవాణి సమయాన్నే అందరూ ప్రామాణికంగా భావించేవారని, ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. టీఆర్పీ రేటింగ్‌ల కోసం కాకుండా, అత్యంత జెన్యూన్‌గా, వాస్తవ ఆధారిత వార్తలను అందించడమే ఆకాశవాణి ప్రత్యేకతన్నారు. ప్రస్తుత కాలంలో రేడియో సెట్లు అందుబాటులో లేకపోయినా, న్యూస్ ఎయిర్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వార్తలు, చర్చా కార్యక్రమాలు వినవచ్చన్నారు. ఆకాశవాణి సంకేతాలు అంతర్జాతీయ స్థాయిలో యూరప్ దేశాల్లో అందుతున్నాయని, ఇటీవల బెల్జియం నుండి వచ్చిన స్పందనే దీనికి నిదర్శనమని హెన్రీ రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎమ్. సోమేశ్వరరావు, ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి జి. దివ్య, న్యూస్ విభాగాధిపతి టి. హెన్రీ రాజ్ లు స్వర సంధ్య (కల్చరల్ కార్యక్రమాల) పోస్టర్ ను ఆవిష్కరించారు.

## మైలారం గ్రామ ప్రవేశానికి హిజ్రాల నిషేధం..

అమరావతి, మే 9: హిజ్రాల ఆగడాలు రోజురోజుకు శృతిమిస్తుండడంతో. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారం గ్రామ అభివృద్ధి కమిటీ వారు. గ్రామంలోకి హిజ్రాలను నిషేధిస్తూ శనివారం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వి డి సి సభ్యులు చెప్పారు. గ్రామంలో ఎవరైనా శుభకార్యాలు నూతన గృహప్రవేశాలకు వెళ్లే సమయంలో హిజ్రాలు అక్కడికి హాజరై వెయ్యిల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడం కాదంటే వారి ఆగడాలు చెప్పడానికి వీలుకాని విధంగా ప్రవర్తిస్తున్నందున. గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకు. శనివారం నుంచి గ్రామంలోకి హిజ్రాలను నిషేధిస్తూ తీర్మానించినట్లు వీడీసీ సభ్యులు వివరించారు.

సిరికొండ మండలం కొండూర్ గ్రామంలో కూడ మండలంలో తొలి సారి హిజ్రాను నిషేదిస్తు వీడీసీ సభ్యులు తీర్మానించారు.గత నెల రోజుల క్రితం వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రసాయాణాలతో కూడిన ఐస్ క్రింలు చిన్న పిల్లలు తినడం వల్ల అనారోగ్యల పాలవుతున్నారని. సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల కంటే ముందే ఐస్ క్రీములను గ్రామంలో విక్రాయించడం నిషేదిస్తు కొండూర్ గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. అలాగే హిజ్రాల ఆగడాలు రోజురోజుకు శృతిమిస్తున్నందున. హిజ్రాలను కూడా గ్రామంలోకి ప్రవేశించ కుండా నిషేధిస్తూ కొండూరు గ్రామ విడిసి సభ్యులు తొలిసారి తీర్మానించారు. కొండూర్ గ్రామం బాటలోనే మైలారం గ్రామం హిజ్రాలను నిషేదిస్తు తీర్మానించింది. కొండూరు గ్రామం బాటలోనే మండలంలోని ఇతర గ్రామాలు ఒక్కొక్కడిగా హిజ్రాలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

# సమ్మిళిత పాలన కోసం డేటా ఆధారిత ఆవిష్కరణలను ప్రదర్శించిన యూఐడీఏఐ డేటా హాకథాన్-2026

న్యూఢిల్లీ, మే 9:పరిపాలన, ప్రజా సేవల పంపిణీని మెరుగు పరచడం లక్ష్యంగా విద్యార్థులు రూపొందించిన డిజిటల్ గుర్తింపు రంగంలోని విశిష్ట ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ... 'యూఐడీఏఐ డేటా హాకథాన్-2026'ను విజయవంతంగా ముగించింది.

డిజిటల్ గుర్తింపు డేటాను వినూత్నంగా, బాధ్యతాయుతంగా వినియోగించుటను ప్రోత్సహించడం కోసం ప్రారంభించిన ఈ హాకథాన్... సమ్మిళితత్వం, సామర్థ్యం, పాలనా ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో విస్తరించదగిన, డేటా ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి విద్యార్థులకు, యువ నిపుణులకు ఒక చక్కటి వేదికను అందించింది.

ఈ కార్యక్రమానికి అద్భుత స్పందన లభించింది. దాదాపు 15,000 బృందాలు దీని కోసం నమోదు చేసుకోగా... 5,000కు పైగా బృందాలు తమ పరిష్కారాలను సమర్పించాయి. దీంతో ఇది డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థలోనే అతిపెద్ద డేటా ఆవిష్కరణల పోటీల్లో ఒకటిగా నిలిచింది.

5,000కు పైగా సమర్పణల పరిశీలన, 30 ప్రాజెక్టుల ఎంపిక, 15 తుది జట్ల సమగ్ర మూల్యాంకనంతో కూడిన ఒక కఠినమైన, బహుళ-దశల మూల్యాంకన ప్రక్రియ ద్వారా మొదటి ఐదు స్థానాలకు ఎంపికైన బృందాలు తుది పోరులో తమ పరిష్కారాలను ప్రదర్శించాయి.

కోల్‌కతాలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లకు చెందిన విజేతల బృందం... యూఐడీఏఐ పంచుకున్న సమీకృత ఆధార్ నమోదు, నవీకరణ డేటాసెట్‌లపై వివరణాత్మక విశ్లేషణను సమర్పించింది.

వారి నైపుణ్యం... వివిధ ప్రాంతాలు, రాష్ట్రాలు, జనాభా సమూహాల్లో నమోదు ధోరణులను, బయోమెట్రిక్ నవీకరణల సరళిపై విలువైన అభిప్రాయాలను అందించడం సహా, సేవల పంపిణీని మెరుగుపరిచేందుకు పలు సిఫార్సులనూ అందించింది.

యూఐడీఏఐ సీఈవో శ్రీ వివేక్ చంద్ర వర్మ మాట్లాడుతూ... విశ్లేషణాత్మక కచ్చితత్వాన్ని బలమైన ప్రజా ప్రయోజన దృక్పథంతో మేళవించిన ఆయా బృందాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇటువంటి ఆవిష్కరణలు... విధానాలను, కార్యాచరణలను మెరుగుపరిచేందుకు ఊతమిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పాలనలో సమ్మిళితత్వాన్ని, సామర్థ్యాన్నీ పెంపొందించడం కోసం బాధ్యతాయుతంగా, నైతిక విలువలకు కట్టుబడి డేటాను ఉపయోగించాల్సిన ప్రాముఖ్యతనూ ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

డిజిటల్ గుర్తింపు, ప్రజల డేటా వినియోగ రంగాల్లో ఆవిష్కరణలను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ యూఐడీఏఐ డేటా హాకథాన్ భవిష్యత్తులో ప్రతియేటా నిర్వహించే అధికారిక కార్యక్రమంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి యూఐడీఏఐ భవిష్యత్ ప్రణాళికలను శ్రీ వివేక్ చంద్ర వర్మ వివరించారు. భవిష్యత్తులో ఈ హాకథాన్ కేవలం విద్యార్థులకే పరిమితం కాకుండా విద్యావేత్తలు, పరిశోధకులు, అంకుర సంస్థలు, ఇతర భాగస్వాములతో మరింత వైవిధ్యమైన... వివిధ రంగాల పరిజ్ఞానం, పద్ధతుల సమ్మిళితం ద్వారా క్లిష్టమైన సమస్యలను పరిష్కరించగల ఆవిష్కరణల వ్యవస్థను పెంపొందించేలా భాగస్వామ్యాన్ని విస్తరిస్తుందని భావిస్తున్నారు.

నిరంతరం ఆవిష్కరణలు, యువత భాగస్వామ్యం, ఆధారాల ఆధారిత విధానాల రూపకల్పనను అభివృద్ధి చేయడం, అమలు చేయడం, విస్తరించడం పట్ల యూఐడీఏఐ నిబద్ధతను ఈ యూఐడీఏఐ డేటా హాక థాన్-2026 ప్రతిబింబిస్తుంది. ఈ హాకథాన్‌లో పాల్గొనేవారికి వాస్తవిక ప్రపంచ డేటాసెట్‌లతో పనిచేసే అవకాశాన్ని కల్పించడం ద్వారా... ఈ కార్యక్రమం వారి సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు, ప్రజా ప్రయోజనాల ఆధారితమైన పరిష్కారాలనూ ప్రోత్సహించింది.

ఈ హాకథాన్ విజయానికి సహకరించిన అభ్యర్థులు, జ్యూరీ సభ్యులు, భాగస్వాములకు యూఐడీఏఐ ధన్యవాదాలు తెలిపింది.

# కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసిన ఎంహెచ్ఏ

న్యూఢిల్లీ, మే 9:దేశవ్యాప్తంగా వరద నిర్వహణ, వడగాలుల సంసిద్ధతను సమీక్షించేందుకు న్యూఢిల్లీలో 2026, మే 10 ఆదివారం కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది.

విపత్తు నిర్వహణ పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం అవలంబిస్తున్న క్రియాశీలక, నిర్ణయాత్మక.. సంపూర్ణ ప్రభుత్వ, సంపూర్ణ సమాజ విధానం నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది.

కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణనీయంగా బలోపేతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య మెరుగైన సమన్వయం, ఎన్‌డీఆర్ఎఫ్ బలగాల బలోపేతం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో "సున్నా ప్రాణ నష్టం" విధానంపై నిరంతరం దృష్టి సారించింది.

ముందస్తు పాలన, ప్రజలే ప్రధానంగా సాగే విపత్తు నిర్వహణ, విపత్తులను తట్టుకోగల దృఢమైన భారత్ నిర్మాణంలో మోదీ ప్రభుత్వానికున్న అంచంచలమైన నిబద్ధతను ఈ ఉన్నత స్థాయి సమీక్ష ప్రతిబింబిస్తోంది.

ప్రాణ నష్టం లేకుండా, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వ సంస్థల సంసిద్ధతను ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అంచనా వేస్తారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వనరుల వినియోగం, వివిధ సంస్థల మధ్య సమన్వయంపై సమీక్షిస్తారు.

దేశవ్యాప్తంగా చేపడుతున్న దీర్ఘకాలిక వరద నివారణ చర్యల పురోగతిని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా సమీక్షించనున్నారు. కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పరిరక్షణ, నదీ నిర్వహణ కార్యక్రమాలు, ముందస్తు అంచనాల్లో శాస్త్రీయ పురోగతి వంటి అంశాలను పరిశీలిస్తారు. గతేడాది సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును అంచనా వేయటం ద్వారా జవాబుదారీతనాన్ని పెంపొందించటం, కార్యకలాపాల సమన్వయంతో పనులను వేగవంతం చేయటంపై ఈ సమావేశంలో చర్చిస్తారు.

అధునాతన సాంకేతికత, రియల్-టైమ్ డేటా అనుసంధానం ద్వారా వరదకు సంబంధించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయటం.

ఏకకాలంలో సంభవించే విపత్తులను ముఖ్యంగా వరదలు, వడగాలుల వంటి వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు సంసిద్ధతను పెంపొందించటం.

ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించటం, విపత్తులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టటం.

అవసరమైన సహాయక సామాగ్రి తగినంత నిల్వ ఉండేలా చూసుకోవటం, వైద్య పరంగా సంసిద్ధతతో ఉండటం.

# మొక్కజొన్న రైతులకు మార్కెట్ కష్టాలు..

**-దళారులకు లాభాల పంట**
**-మార్కెట్ యార్డ్ లో 80 వేల బస్తాలు నిలువలు**
**-ప్రభుత్వ ధర 2400 దళారుల ధర 1750**
**-తగ్గుముఖం పట్టిన మొక్కజొన్న**
**-గ్రామాల నుండి గోదాంకు తరలిస్తున్న మొక్కలు**

నాగర్‌కర్నూల్, మే 9: జిల్లాలో మొక్కజొన్న రైతులు తీవ్ర నష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొంటుండగా దళారులు, ప్రైవేట్ వ్యాపారులు మాత్రం లాభాల పంట పండించుకుంటున్నారు. ప్రభుత్వ అలసత్వం, అధికారుల సమన్వయ లోపం, లారీల కొరత కారణంగా రైతులు మార్కెట్ యార్డుల్లో అష్టకష్టాలు పడుతున్నారు.

ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, సరైన విధంగా కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. దీంతో విసిగిపోయిన రైతులు గ్రామాలకే వచ్చే దళారులు, ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌ను రూ.1650 నుంచి రూ.1800 వరకు అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కో రైతు క్వింటాల్‌కు రూ.600 నుంచి రూ.850 వరకు నష్టపోతున్నారు. 100 క్వింటాళ్లు పండించిన రైతుకు దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు.



జిల్లాలో లక్ష ఎకరాల్లో సాగైన మొక్కజొన్నలో సగానికి పైగా పంట ప్రైవేట్ వ్యాపారులకే వెళ్లిపోతున్నట్లు సమాచారం. కొందరు దళారులు కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ వ్యాపారులతో కుమ్మక్కై రైతుల పేర్లతో మొక్కజొన్న కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధర పొందుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కయ్యారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఏప్రిల్ 1 నుంచి నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు రైతులకు 4 లక్షల 62 వేల గన్నీ బ్యాగులు పంపిణీ చేసినట్లు సీఈవో నరేష్ తెలిపారు. రైతుల నుంచి 3 లక్షల 10 వేల బస్తాల మొక్కజొన్న మార్కెట్‌కు వచ్చినట్లు చెప్పారు.

మార్కెట్ యార్డులో లారీల కొరత, గన్నీ బ్యాగులు సకాలంలో అందకపోవడం వల్ల రైతులు రోజుల తరబడి కాపలా కాయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పంట అమ్ముకోవాల్సి వస్తోంది. ఒక్కో ఎకరాకు 42 నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినప్పటికీ, మార్కెట్ యార్డులో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక బస్తా తరలింపుకు రూ.42 వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.

గత 15 రోజుల క్రితం మార్కెట్ యార్డులో 1.40 లక్షల బస్తాలు నిల్వ ఉండగా, ప్రస్తుతం అవి 80 వేల బస్తాలకు తగ్గినట్లు తెలుస్తోంది. అయితే ప్రతిరోజూ కేవలం రెండు నుంచి మూడు లారీలే మొక్కజొన్న తరలించేందుకు వస్తుండటంతో సమస్య కొనసాగుతోంది. మరోవైపు రోజుకు దాదాపు 10 వేల బస్తాలు కొత్తగా మార్కెట్‌కు వస్తుండటంతో నిల్వలు తగ్గడం లేదు.

రైతుల సమస్యలపై టీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, డీఎస్పీ, బీజేపీ తదితర ప్రతిపక్ష పార్టీలు మార్కెట్ యార్డును సందర్శించి ఆందోళనలు చేపట్టాయి. రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించి చర్యలు చేపట్టారు.

ఇటీవల స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ కలిసి మార్కెట్ యార్డును సందర్శించారు. వారు వచ్చిన రోజే 14 లారీలు ఏర్పాటు చేసి మొక్కజొన్న తరలింపును వేగవంతం చేశారు. దాదాపు 60 వేల బస్తాలను త్వరితగతిన తరలించినట్లు సమాచారం.

అయితే ఒకవైపు తరలింపులు జరుగుతుండగానే మరోవైపు కొత్తగా పెద్ద మొత్తంలో పంట మార్కెట్‌కు చేరుతోంది. దీంతో నాగనూలు-వనపర్తి మధ్య ఉన్న సహకార సంఘం గోదాములకు కూడా మొక్కజొన్నను తరలిస్తున్నారు. అక్కడ దాదాపు 30 వేల బస్తాలను నిల్వ చేసినట్లు తెలుస్తోంది.

మొత్తంగా అధిక దిగుబడి వచ్చినప్పటికీ, సరైన కొనుగోలు వ్యవస్థ లేక రైతులకు న్యాయం జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నీ బ్యాగులు, లారీలు, రవాణా సౌకర్యాలు సమృద్ధిగా కల్పించి, పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా వేగంగా కొనుగోళ్లు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను రైతులు కోరుతున్నారు.

# టాక్టికల్ అడ్వాన్స్ రేంజ్ ఆగ్మెంటేషన్ వెపన్ తొలి వైమానిక ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో, ఐఏఎఫ్

న్యూఢిల్లీ, మే 9:టాక్టికల్ అడ్వాన్స్&డ రేంజ్ ఆగ్మెంటేషన్ (టీఏఆర్ఏ) ఆయుధ తొలి వైమానిక ప్రయోగాన్ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత వైమానిక దళం (ఐఏఎఫ్) విజయవంతంగా నిర్వహించాయి. 2026 మే 7న ఒడిశా తీరంలో ఈ ప్రయోగం జరిగింది. మాడ్యులర్ రేంజ్ ఎక్స్‌టెన్షన్ కిట్ అయిన టీఏఆంఏ.. అన్ గైడెడ్ క్షిపణులను గైడెడ్ క్షిపణులుగా మార్చగల భారత దేశపు మొట్టమొదటి స్వదేశీ గ్లైడ్ ఆయుధ వ్యవస్థ.

భూతల లక్ష్యాలను నిర్వీర్యం చేసేలా తక్కువ ఖర్చుతో ఈ ఆయుధ కచ్చితత్వాన్ని, విధ్వంసక శక్తిని పెంచేందుకు ఇతర డీఆర్‌డీవో ల్యాబరేటరీలతో కలిసి హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) టీఏఆర్ఏను రూపొందించి అభివృద్ధి చేసింది. అత్యాధునికమైన, తక్కువ ఖర్చుతో రూపొందించిన మొదటి గ్లైడ్ ఆయుధమిది. అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వాములు (డీసీపీపీ), ఇతర భారతీయ పరిశ్రమలతో కలిసి ఈ కిట్‌ను అభివృద్ధి చేశారు. ఇవి ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించాయి.

తొలి వైమానిక ప్రయోగం నేపథ్యంలో డీఆర్‌డీవో, ఐఏఎఫ్, డీసీపీపీను, పరిశ్రమను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో దీనిని ముఖ్యమైన పరిణామంగా వర్ణించారు.

వైమానిక ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన బృందాలను రక్షణ శాఖ పరిశోధనాభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వీ కామత్ అభినందించారు.

# వత్సవాయిలో చలివేంద్రం ప్రారంభం..

**-ప్రజాసేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు**
**-కేడిసిసి చైర్మన్ నెట్టెం రఘురాం**
**-కేడీసీసీ సేవలు అభినందనీయం**
**-ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య**

అమరావతి, మే 9:ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలం వత్సవాయి గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేడీసీసీ బ్యాంక్ వత్సవాయి బ్రాంచ్ ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెట్టెం శ్రీ రఘురాం, శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా నెట్టెం శ్రీ రఘురాం మాట్లాడుతూ.. కేడీసీసీ బ్యాంక్ సిబ్బంది, సహకార సంఘాల అధ్యక్షుల సమన్వయంతో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండుతున్న ఎండల్లో బాటసారుల దాహార్తిని తీర్చడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేడీసీసీ బ్యాంక్ సేవా కార్య( కమాలు నిరంతరం కొనసాగిస్తోందని, ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సమయంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న కేడీసీసీ బ్యాంక్ మరింత విస్తృత స్థాయిలో సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# కాలువల్లో గులాబీ పూలు చల్లి నిరసన వ్యక్తం చేసిన ప్రజలు



వరంగల్, మే 9:రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలాల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్ 35వ డివిజన్ స్థానిక కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి మేరుగు అశోక్ డిమాండ్ చేశారు.

శనివారం 35వ డివిజన్‌లో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లోని నాలాల పరిస్థితి పూర్తిగా అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనగా గులాబీ పువ్వులు చల్లి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న స్థానిక పాలకులకు ప్రజలు పలుమార్లు సమస్యలను విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం వరంగల్ మహానగర పాలక సంస్థ పదవీకాలం ముగియడంతో నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో అయినా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.

రానున్న వర్షాకాలంలో 35వ డివిజన్ పూర్తిగా ముంపుకు గురయ్యే ప్రమాదం ఉన్నందున వీలైనంత త్వరగా నాలాల సిల్ట్ తొలగింపు పనులను పూర్తి చేయాలని మేరుగు అశోక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం రవి, నాగుల భిక్షపతి, బజ్జూరి అంజయ్య, వెంగల్దాస్ కృష్ణ, ఉగ్గె రమేశ్, పాల సత్యం, కొత్తగట్టు శ్యామ్, జన్ను రాధ, చిదురాల సాయి, అంకతి అఖిల్, శ్రవణ్, సాయి విక్షిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక సాంకేతికతతో పట్టాదారు పాసు పుస్తకాలు

**-ఎన్నడూ లేని విధంగా సురక్షిత ఫీచర్లతో పంపిణీ**
**-భూ యాజమాన్య వ్యవస్థలో సరికొత్త మైలురాయి..**
**-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు**



అమరావతి, మే 9:దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా తీర్చిదిద్దుతోందని.. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం అనుసంధానంతో పట్టాదారు పుస్తకాలను రాజముద్రతో అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

శనివారం ఎ.కొండూరు మండలం, మాధవరంలో జరిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. 702 మంది స్థానిక లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భూమి అంటే కుటుంబానికి ఉద్వేగాలతో ముడిపడిన అంశమని..

ఈ నేపథ్యంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు సరికొత్త పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో సర్వే జరగ్గా.. శాటిలైట్ టెక్నాలజీ, జియో కోడ్స్ అనుసంధానంతో రాజముద్రతో సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. భద్రతా ఫీచర్లతో ఈ పుస్తకాలు రూపొందించినట్లు తెలిపారు. భూ సంబంధ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ పాసుపుస్తకాలు దోహదం చేస్తాయని.. హద్దులను మార్చేయడం వంటి మోసాలు కుదరవని స్పష్టం చేశారు. అత్యంత కచ్చితత్వంతో మన భూములు, మన హద్దులు భద్రంగా ఉంటాయని వివరించారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా భూమికి సంబంధించిన వివరాలను కంప్యూటర్‌లో, మొబైల్‌లో చూసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

రైతులు లాభదాయకమైన పంటలు సాగుచేసి.. వ్యవసాయంతో పాటు పాడికి ప్రాధాన్యమిస్తూ ముందుకెళ్లాలని, అన్నదాతలు లక్షాధికారులు కావాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యానపంటలు సాగుదిశగా వెళ్తూ ప్రకృతి సేద్య విధానాలను అవలంబించాలన్నారు. ఎ.కొండూరు ప్రాంతాన్ని అగ్రీ, హార్టీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. నాలుగు మండలాల పరిధిలోని చాలా ప్రైవేటు భూములు 22ఏలో ఉన్నాయని.. ఈ భూములను 22ఏ నుంచి తొలగించి యజమానులకు భూహక్కులు కల్పించాలని కోరారు.

అన్ని వర్గాల్లోని పేదలకు వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ప్రతి తండాలో సిమెంటు రోడ్లు ఉండేలా చేయడంలో తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం అందిస్తున్న పట్టదారు పాసుపుస్తకాలు సెక్యూరిటీ ఫీచర్లతో ఉన్నాయని.. యజమానులకు పూర్తిస్థాయిలో భూ భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటింటికీ కృష్ణాజలాలు అందించే కార్యక్రమాన్ని ఎ.కొండూరులో ప్రాంతంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించేలా కృషిచేయనున్నట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు.

కార్యక్రమంలో తిరువూరు ఆర్‌డీవో ఎ.కుమార్, తహసీల్దార్ ఎం.ఉదయ భాస్కర రావు, ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వానం మునియ్య, డివిజనల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు వాసు తదితరులు పాల్గొన్నారు.


పంచమ వర్ధంతి సమావేశం



జననం: 14-06-1941 - నిర్యాణం 15-05-2021

కెకెఆర్ సంస్మరణ ప్రసంగం

15 మే, 2026
సాయంత్రం 6 గంటలకు

సంస్మరణ ప్రసంగం
తెలుగువారి చరిత్ర - సంస్కరణోద్యమాలు
ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

పుస్తకావిష్కరణ
అత్యాధునిక పాశ్చాత్య సాహిత్య విమర్శ - నాలుగు వాచకాలు
(కెకెఆర్ సంస్మరణ ప్రసంగం-2)
ప్రొ. బి. తిరుపతిరావు

తెలుగువారి చరిత్ర - సంస్కరణోద్యమాలు
(కెకెఆర్ సంస్మరణ ప్రసంగం-3)
ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

తెలంగాణ సారస్వత పరిషత్
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

అందరూ ఆహ్వానితులే... - కుటుంబ సభ్యులు, మిత్రులు, శిష్యులు

# గడచిన రెండు రోజుల్లో సుమారు 87.66 లక్షల సిలిండర్ల బుకింగ్స్‌కు గానూ, 97 లక్షలకు పైగా ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ

న్యూఢిల్లీ, మే 9: పశ్చిమాసియాలోని పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తూ పౌరులను అప్రమత్తం చేసే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ఇవాళ నేషనల్ మీడియా సెంటర్‌లో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువు, నౌకాయానం, జల మార్గాలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇంధన లభ్యత, సముద్రయాన కార్యకలాపాలు కీలక రంగాల్లో స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు తీసుకుంటున్న చర్యలపై తాజా సమాచారాన్ని అందించారు.

**ఇంధన సరఫరా, ఇంధన లభ్యత**

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీ నిరంతరం అందుబాటులో ఉండేలా తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ప్రస్తుత ఇంధన సరఫరా పరిస్థితిపై పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ తాజా సమాచారాన్ని అందించింది. అందులోని ముఖ్యాంశాలు:

**బహిరంగ ప్రకటన, పౌరులకు అవగాహన**

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీల లభ్యత కోసం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నందున పౌరులు భయాందోళనలతో ముందస్తుగా నిల్వ చేసుకోవద్దని సూచించారు.

వదంతుల పట్ల జాగ్రత్త వహించండి. సరైన సమాచారం కోసం అధికారిక వనరులను మాత్రమే నమ్మండి.

ఎల్పీజీ వినియోగదారులు డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాలకు వెళ్లకుండా, డిజిటల్ బుకింగ్ వేదికలను వినియోగించాలని కోరారు.

పీఎన్‌జీ, ఎలక్ట్రిక్, ఇండక్షన్ కుక్‌టాప్‌ల వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించేలా పౌరులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో పౌరులందరూ రోజువారీ వినియోగంలో ఇంధనాన్ని పొదుపు చేసేందుకు అవసరమైన ప్రయత్నాలు చేయాలని కోరారు.

**ప్రభుత్వ సన్నద్ధత, సరఫరా నిర్వహణ చర్యలు**

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా దేశీయ ఎల్పీజీ, పీఎన్‌జీ, సీఎన్‌జీ (రవాణా)లకు 100 శాతం సరఫరాకు ప్రభుత్వం హామీ ఇచ్చింది.

వాణిజ్య ఎల్పీజీ విషయంలో ఆసుపత్రులు, విద్యా సంస్థలకు తొలి ప్రాధాన్యతనిచ్చారు. వీటితో పాటు ఫార్మా, ఉక్కు, ఆటోమొబైల్, విత్తనాలు, వ్యవసాయం మొదలైన రంగాలకు కూడా ప్రాధాన్యత కల్పించారు. అదనంగా వలస కార్మికులకు అందించే 5 కేజీల ఎఫ్‌టీఎల్ సరఫరాను 2026 మార్చి 2, 3 తేదీల నాటి సగటు సరఫరా ఆధారంగా రెట్టింపు చేశారు.

డిమాండ్, సరఫరాను సమన్వయం చేసేందుకు రిఫైనరీ ఉత్పత్తిని పెంచారు. గ్యాస్ బుకింగ్ గడువును పట్టణ ప్రాంతాల్లో 21 నుంచి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెంచటం ద్వారా సరఫరాను క్రమబద్ధీకరించారు.

ఎల్పీజీ డిమాండ్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అందుబాటులోకి తెచ్చారు.

చిన్న, మధ్య తరహా వినియోగదారులకు పంపిణీ చేసేందుకు రాష్ట్రాలకు అదనపు బొగ్గును సరఫరా చేయాలని బొగ్గు మంత్రిత్వ శాఖ కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌ను ఆదేశించారు.

గృహ, వాణిజ్య వినియోగదారుల కోసం కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను సులభతరం చేయాలని రాష్ట్రాలకు సూచించారు.

**రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సమన్వయ ప్రయత్నాలు, సంస్థాగత వ్యవస్థలు**

నిత్యావసర వస్తువుల చట్టం-1955, ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వు-2000 ప్రకారం సరఫరాను పర్యవేక్షించేందుకు నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉంది.

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీతో సహా నిత్యావసర వస్తువుల సరఫరా పరిస్థితిని పర్యవేక్షించటం, నియంత్రించటంలో రాష్ట్రాలు, యూటీ ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాలి. అన్ని రాష్ట్రాలు, యూటీలకు పలు లేఖలు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా భారత ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

భారత ప్రభుత్వ 27.03.2026, 02.04.2026 నాటి లేఖల ద్వారా తగినంత ఇంధన లభ్యత గురించి పౌరులకు భరోసా ఇవ్వటానికి క్రియాశీల ప్రజా సమాచార ప్రసార ఆవశ్యకతను తెలియజేసింది. రాష్ట్రాలు, యూటీలతో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 02.04.2026న (ఎంఓపీఎన్‌జీ కార్యదర్శి అధ్యక్షతన), 06.04.2026న (ఎంఓపీఎన్‌జీ కార్యదర్శి, ఐ అండ్ బీ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శుల అధ్యక్షతన) సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లోని ప్రధాన అంశాలు:

రోజువారీ పత్రికా ప్రకటనలను విడుదల చేయటం, క్రమం తప్పకుండా ప్రజలకు సలహాలు జారీ చేయటం.

సోషల్ మీడియాలో వచ్చే నకిలీ వార్తలు, తప్పుడు సమాచారాన్ని పర్యవేక్షించి, వాటిని అరికట్టటం.

జిల్లా పాలన వ్యవస్థ ద్వారా రోజువారీ అమలు చర్యలను ముమ్మరం చేయటం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) సమన్వయంతో దాడులు, తనిఖీలను కొనసాగించటం.

ఆయా రాష్ట్రాలు, యూటీల్లో వాణిజ్య ఎల్పీజీ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయటం.

రాష్ట్రాలు, యూటీలకు కేటాయించిన అదనపు ఎస్‌కేఓల కోసం ఎస్‌కేఓ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయటం.

పీఎన్‌జీ, ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించటం.

ముఖ్యంగా గృహ అవసరాలకు ఎల్పీజీ సరఫరాకు ప్రాధాన్యతనివ్వటం, సరఫరా స్థిరత్వానికి 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల పంపిణీని చేపట్టటం.

నిల్వలను, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు అన్ని రాష్ట్రాలు, యూటీలు కంట్రోల్ రూంలను, జిల్లా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశాయి.

అనేక రాష్ట్రాలు, యూటీలు పత్రికా సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

**అమలు, పర్యవేక్షణ చర్యలు**

దేశవ్యాప్తంగా ఎల్పీజీ నిల్వలను, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా 2,000లకు పైగా దాడులు జరిగాయి.

పీఎస్‌యూ ఎంఓసీలు ఆకస్మిక తనిఖీలను మరింత ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా ఇప్పటివరకు 378 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్‌షిప్‌లపై జరిమానాలు విధించగా, నిన్నటి వరకు 76 డిస్ట్రిబ్యూటర్‌షిప్‌లు సస్పెండ్ అయ్యాయి.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ఎల్పీజీ సరఫరాపై ప్రభావం కొనసాగుతోంది.

గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా చేసేందుకు తొలి ప్రాధాన్యతనిచ్చారు.

ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద నిల్వలు అయిపోయినట్లు నివేదికలు అందలేదు.

నిన్నటి లెక్కల ప్రకారం.. పరిశ్రమ వ్యాప్తంగా ఆన్‌లైన్ ఎల్పీజీ సిలిండర్ బుకింగ్స్ దాదాపు 99 శాతానికి పెరిగాయి.

డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) ఆధారిత డెలివరీలు సుమారు 95 శాతానికి పెరిగాయి. ఈ డీఏసీ కోడ్ వినియోగదారులు నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు వస్తుంది.

గడిచిన రెండు రోజుల్లో సుమారు 87.66 లక్షల సిలిండర్ల బుకింగ్స్ అవగా, 97 లక్షలకు పైగా ఎల్పీజీ సిలిండర్లు పంపిణీ అయ్యాయి.

**వాణిజ్య ఎల్పీజీ సరఫరా, కేటాయింపు చర్యలు**

వాణిజ్య ఎల్పీజీ మొత్తం కేటాయింపులను సుమారు 70 శాతానికి పెంచారు. ఇందులో 10 శాతం కేటాయింపులు సంస్కరణలకు అనుగుణంగా చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వ 06.04.2026 నాటి లేఖ ద్వారా కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. వలస కూలీల కోసం 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల రోజువారీ సంఖ్యను రెట్టింపు చేశారు. 2026 మార్చి 2, 3 తేదీల్లో జరిగిన సగటు సరఫరా ఆధారంగా గతంలో నిర్ణయించిన 20 శాతం పరిమితి కంటే ఎక్కువగా వీటిని పంపిణీ చేయనున్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీల) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సిలిండర్లను కేవలం వలస కూలీలకు మాత్రమే అందజేస్తాయి.

గత రెండు రోజుల్లోనే 1.11 లక్షలకు పైగా 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు అమ్ముడయ్యాయి.

ఏప్రిల్ 3, 2026 నుంచి పీఎస్‌యూ ఓఎంసీలు దేశవ్యాప్తంగా 10,700లకు పైగా అవగాహన సదస్సులను నిర్వహించాయి. ఈ సదస్సుల ద్వారా సుమారు 1,89,500.. 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లను విక్రయించారు.

రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ఆయా రాష్ట్రాలు, యూటీల్లో కమర్షియల్ ఎల్పీజీ విక్రయ ప్రణాళికను ఖరారు చేసేందుకు ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు.

గత రెండు రోజుల్లో మొత్తం 15,493 మెట్రిక్ టన్నుల (19 కిలోల బరువున్న సుమారు 8.15 లక్షల సిలిండర్లతో సమానం) వాణిజ్య ఎల్పీజీ అమ్ముడైంది.

గత రెండు రోజుల్లో పీఎస్‌యూ ఎంఓసీలు మొత్తం 613 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీని విక్రయించాయి.

**సహజవాయు సరఫరా, పీఎన్జీ విస్తరణ చర్యలు**

డీ- పీఎన్‌జీ, సీఎన్‌జీలకు 100 శాతం సరఫరా ద్వారా వినియోగదారులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది.

ఎరువుల కర్మాగారాలకు ఇచ్చే మొత్తం గ్యాస్ కేటాయింపులను... వాటి గత ఆరు నెలల సగటు వినియోగంలో దాదాపు 98 శాతానికి పెంచారు.

అంతేకాకుండా సీజీడీ వ్యవస్థల ద్వారా సరఫరా సహా... ఇతర పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరాను 80 శాతం వరకూ పెంచారు.

వాణిజ్యపరంగా ఎల్‌పీజీ లభ్యతపై నెలకొన్న ఆందోళనలను పరిష్కరించడం కోసం... తమ భౌగోళిక పరిధిలో ప్రాంతాలన్నింటిలో హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటీన్లకు వాణిజ్య పరమైన పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యమివ్వాలని సీజీడీ సంస్థలకు ప్రభుత్వం సూచించింది.

గృహ, వాణిజ్యపరమైన పీఎన్‌జీ కనెక్షన్లకు ఐజీఎల్, ఎంజీఎల్, జీఏఐఎల్ గ్యాస్, బీపీసీఎల్ వంటి సీజీడీ కంపెనీలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి.

సీజీడీ నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలను భారత ప్రభుత్వం కోరింది.

దీర్ఘకాలంలో ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీ దిశగా మార్పునకు సహకరించగలిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్యపరమైన ఎల్‌పీజీ కేటాయింపులో 10 శాతం అదనంగా ఇవ్వనున్నట్లు 2026 మార్చి 18 నాటి లేఖ ద్వారా భారత ప్రభుత్వం ప్రకటించింది.

పీఎన్‌జీ విస్తరణ సంస్కరణలతో ముడిపడి ఉన్న అదనపు వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును 22 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు పొందుతున్నాయి.

2026 మార్చి 24న జారీ చేసిన లేఖ ద్వారా సీజీడీ మౌలిక సదుపాయాల కోసం వేగవంతమైన ఆమోద ప్రక్రియను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా సీజీడీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్య ప్రాతిపదికన పరిశీలించడానికి మూడు నెలలపాటు ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ (పైప్‌లైన్లు, ఇతర సదుపాయాల నిర్మాణం, నిర్వహణ, విస్తరణ ద్వారా) ఉత్తర్వు- 2026ను భారత .ప్రభుత్వం 2026 మార్చి 24 నాటి గెజిట్ ద్వారా ప్రకటించింది. దేశవ్యాప్తంగా పైప్‌లైన్ల నిర్మాణం, విస్తరణ కోసం ఒక సరళీకృత, కాలపరిమితితో కూడిన విధానాన్ని ఈ ఉత్తర్వు నిర్దేశిస్తుంది. భూసేకరణ, అనుమతుల్లో జాప్యాన్ని నివారిస్తూ.. నివాస ప్రాంతాలు సహా అన్ని చోట్లా సహజ వాయు మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి తోడ్పడుతుంది.

దీనివల్ల పీఎన్‌జీ వ్యవస్థ [illegible] వేగవంతమవడంతోపాటు.. మారుమూల ప్రాంతాలకు కూడా అనుసంధానం పెరుగుతుంది. ఇది శుద్ధ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ.. భారత ఇంధన భద్రతను, గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

డీ-పీఎన్‌జీ కనెక్షన్లను వేగవంతం చేయాలని సీజీడీ సంస్థలను పీఎన్‌జీఆర్బీ ఆదేశించింది. అలాగే, పీఎన్‌జీ విస్తరణలో వేగాన్ని కొనసాగించడం కోసం జాతీయ పీఎన్‌జీ కార్యక్రమం 2.0ను 2026 జూన్ 30 వరకు పొడిగించింది.

పర్యావరణానికి మేలు చేసే, సురక్షితమైన, స్వావలంబన కలిగిన ఇంధన వనరులను పెంచేలా... రాష్ట్రాల కోసం ఒక నమూనా సీబీజీ విధాన ముసాయిదాను భారత ప్రభుత్వం రూపొందించింది. పెట్టుబడిదారులకు అనుకూలమైన, అమలు ప్రాతిపదికన వ్యవస్థలను రాష్ట్రాలు సొంతంగా రూపొందించుకునేలా ఒక సమగ్రమైన, సరళమైన మార్గదర్శకంగా ఈ నమూనా విధానం ఉపయోగపడుతుంది. ఈ విధానాన్ని అమలు చేసే రాష్ట్రాలకు.. వాణిజ్యపరమైన ఎల్‌పీజీ కోటా అదనపు కేటాయింపుల తదుపరి విడతలో ప్రాధాన్యమిస్తారు.

సీజీడీ వ్యవస్థ, మౌలిక సదుపాయాలను నెలకొల్పేందుకు లేదా వాటి నిర్వహణకు 15 రోజుల్లోగా అనుమతి మంజూరు చేయడం కోసం ఎస్‌పీసీబీ, పీసీసీలకు తగిన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా... 2026 ఏప్రిల్ 7 నాటి ఉత్తర్వుల ద్వారా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)ని ఆదేశించింది.

2026 మార్చి నుంచి దాదాపు 6.50 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లకు గ్యాస్ సరఫరా మొదలైంది. మరో 2.66 లక్షల కనెక్షన్లకు మౌలిక సదుపాయాలను కల్పించారు. దీంతో మొత్తం కనెక్షన్ల సంఖ్య 9.16 లక్షలకు చేరింది. అంతేకాకుండా దాదాపు 7.08 లక్షల వినియోగదారులు కొత్త కనెక్షన్ల కోసం నమోదు చేసుకున్నారు.

2026 మే 7 నాటికి 50,400కు పైగా పీఎన్‌జీ వినియోగదారులు వెబ్‌సైట్ ద్వారా తమ ఎల్‌పీజీ కనెక్షన్లను వదులుకున్నారు.

అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. తగినంత ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

# బ్రిక్స్: ఎమ్ఎస్ఎమ్ఈలకు మరింత సహకారం అంటున్న భారత్

న్యూఢిల్లీ, మే 9:ఈ సంవత్సరంలో (2026) బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతను నిర్వర్తిస్తున్న భారత్ "నూతన పారిశ్రామిక విప్లవం అంశంపై బ్రిక్స్ భాగస్వామ్యం" (పార్ట్‌ఎన్ఐఆర్)లో భాగంగా సూక్ష్మ, లఘు, మధ్యతరహా సంస్థల (ఎమ్ఎస్ఎమ్ఈ) సహకారానికి సంబంధించి ఒక కొత్త అజెండాను ముందుకు తీసుకుపోతోంది. భారత్ అధ్యక్ష పదవీకాలంలో ఎమ్ఎస్ఎమ్ఈ వర్కింగ్ గ్రూపునకు సంబంధించిన మూడు సమావేశాలతో పాటు మొదటి బ్రిక్స్ ఎమ్ఎస్ఎమ్ఈ ఫోరమ్‌ను కూడా నిర్వహించే బాధ్యతను సూక్ష్మ, లఘు, మధ్యతరహా సంస్థల మంత్రిత్వ శాఖకు అప్పగించారు.

ఎస్ఎమ్ఈ వర్కింగ్ గ్రూపు తొలి సమావేశాన్ని (వెబినార్) 2026 ఏప్రిల్ 24న విజయవంతంగా నిర్వహించారు. దీనిలో "ఎమ్ఎస్ఎమ్ఈల కోసం ఆర్థిక సహాయ లభ్యత" అంశంపై దృష్టిని కేంద్రీకరించారు. బ్రిక్స్ సభ్యదేశాల మధ్య జరిగిన చర్చల్లో "ఆర్థిక సమ్మిళితత్వం, అక్షరాస్యత, రుణ సన్నద్ధతల ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈ రుణాల్లో అంతరాన్ని పూరించడం"తో పాటు "ఫిన్‌టెక్-ఆధారిత అనుబంధ విస్తారిత వ్యవస్థలు: ఎస్ఎమ్ఈ రుణ పరిధి విస్తరణ, నిరంతరాయంగా ప్రపంచ వాణిజ్య చెల్లింపుల ప్రక్రియ"పై చర్చించారు.

ఈ వెబినార్లో బ్రిక్స్ సభ్యదేశాలు చురుకుగా పాలుపంచుకున్నాయి. ఎమ్ఎస్ఎమ్ఈ ఆర్థిక సహాయానికి సంబంధించిన సవాళ్లు, అవకాశాలపై అనుభవ సహిత, అత్యుత్తమ పద్ధతుల్ని పంచుకోవడానికి ఈ వెబినార్ ఒక కీలక వేదికగా నిలిచింది. ఆర్థికాభివృద్ధి, ఉపాధికల్పన, నూతన ఆవిష్కరణ, అభివృద్ధి ఫలాలను అందరికీ అందుబాటులోకి తీసుకు పోవడం.. వీటికి కీలక చోదక శక్తిగా ఎమ్ఎస్ఎమ్ఈలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయని చర్చల్లో స్పష్టం చేశారు. చాలినంత రుణాలను సకాలంలో అందుకోవడంలో సవాళ్లు ఎదురవుతున్న సంగతిని ప్రస్తావించారు. రుణ మంజూరులో అంతరాలను తొలగించడానికీ, ఆర్థిక సమ్మిళితత్వం, మెరుగైన ఆర్థిక అవగాహనల ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈల రుణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికీ బహుళపార్శ్వాలతో కూడిన దార్శనికత అవసరమని సూచించారు.

సంస్థాగత సామర్థ్యాలను పటిష్ఠపరుచుకోవాలనీ, నూతన ఆర్థిక సహాయ పద్ధతుల్ని ప్రోత్సహించాలనీ, ఎమ్ఎస్ఎమ్ఈలకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి సంబంధించి ఒక అనుకూల వాతావరణాన్ని ఏర్పరచడానికి బ్రిక్స్ దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందనీ సమావేశంలో స్పష్టం చేశారు. అభివృద్ధిపరంగా ఒకే విధమైన సవాళ్లను ఎదుర్కొంటున్న బ్రిక్స్ సభ్యదేశాల మధ్య విధాన మార్పిళ్లకు మార్గాన్ని ఈ చర్చలు సుగమం చేశాయి. బ్రిక్స్ దేశాల ఆర్థిక వ్యవస్థల్ని సుదృఢ, సమ్మిళిత, ప్రపంచ దేశాలతో పోటీ పడే ఎమ్ఎస్ఎమ్ఈ రంగాలకు ప్రోత్సాహాన్ని అందించాలన్న ఉమ్మడి నిబద్ధతను కూడా ఈ చర్చల్లో పునరుద్ఘాటించారు.

# 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి : కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్గొండ, మే 9: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే బాలు నాయక్‌తో కలిసి కలెక్టర్ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు చెప్పారు. మిగిలిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.487 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలన్నారు. అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఇన్‌చార్జి ఆర్డీఓ రమణారెడ్డి, డీఎస్ఓ వెంకటేష్, డీఎం రాంపత్తి నాయక్, డీసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తాసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డీటీ ముబీన్, రైస్ మిల్లర్ల తరఫున వెంకన్న, శ్రీనివాస్, అధికారులు హాజరయ్యారు.

# రామలింగాపురంలో కన్నుల పండువగా జీవధ్వజ ప్రతిష్ఠ



ఖమ్మం, మే 9:ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని లింగం బంజర- రామలింగాపురంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో జీవధ్వజ యంత్ర పుణప్రతిష్ఠ, గంగమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం కన్నుల పండుగగా నిర్వహించారు. సూరపరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహక కమిటీ, ప్రముఖ పురోహితుడు బ్రహ్మ రాజు అచ్యుత రామారావు శర్మతో కలిసి వేద పండితులు నాగసాయి శర్మ, కిరణ్ కుమార్ శర్మ, ఆదిత్య శర్మ, రాము శర్మ మూడు రోజులపాటు ప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, కర్మణ, పుణ్యాహవచనం, గర్తన్యాసము, జీవధ్వజ యంత్రస్థాపన, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, మండప ఉద్వాసనలు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా దేవాలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు లింగం బంజార, రామలింగాపురం గ్రామస్తులతో పాటు సమీప గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్ తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, మే 9:జిల్లాలోని మాగనూరు మండల కేంద్రం పెద్ద వాగు నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా ను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అడ్డుకున్నారు.

నారాయణపేట- మక్తల్- కొడంగల్ ఎత్తిపోతల్లో భాగంగా కొనసాగుతున్న పైప్‌లైన్ , ట్యాంకు నిర్మాణం పనులకు మాగనూరు వాగు నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. శనివారం కూడా హిటాచితో ఇసుకను తరలించేందుకు పనులను ప్రారంభించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వాగు వద్దకు చేరుకొని అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు.

అనుమతులు లేకుండా పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తే భవిష్యత్తులో గ్రామస్తులకు తాగునీరు, సాగు నీటి ఇబ్బందులు తలెత్తుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివారు రైతులకు ఇబ్బంది కలిగిస్తే ఎంత మాత్రం సహించబోమని హెచ్చరించారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ అక్రమాలకు అధికారులు, పోలీసులు సహకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

# సమగ్ర నీటి పారుదలతోనే వ్యవసాయాభివృద్ధి

నల్గొండ, మే 9: సమగ్ర నీటి పారుదలతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహమ్మద్ ఖుర్షీద్ మొయినుద్దీన్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకుని నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆవరణలో శనివారం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణ అవసరాన్ని వివరించారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. చెరువుల పూడికతీత చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. చెరువుల పరిరక్షణతో వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎర్రోళ్ల వెంకటస్వామి, ఏఈ గిరిజన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

## -ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
## - దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

నల్గొండ, మే 9:ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని, ప్రతి గింజను



ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలుపై శనివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ రమణా రెడ్డి, రైస్ మిల్లర్స్, ట్రాన్స్‌పోర్టు, తాసీల్దార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, రవాణా (లారీలు), గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగినన్ని టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. రైతుల నుండి అధిక తూకం తూయకుండా, వెంటనే లారీలు పంపి ఎగుమతులు వేగవంతం చేయాలని కోరారు.

యాసంగి ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చూడాలన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిట్టచివరి రైతు వరకూ న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పుడున్న 70 లారీలతో పాటు మరో 30 లారీలు అదనపుగా ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లయ్, పీఏసీఎస్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, కొండ్ర శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, రైస్ మిల్లర్ అసోసియేషన్, యువ నాయకులు శ్రీకాంత్ యాదవ్, సర్పంచ్ బాబు రామ్ నాయక్ పాల్గొన్నారు.

# పోచిషే బోయిషాఖ్ సందర్భంగా గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ప్రధానమంత్రి నివాళులు

న్యూఢిల్లీ, మే 9:నేడు పోచిషే బోయిషాఖ్ (రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి) సందర్భంగా గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక నివాళులర్పించారు.

గురుదేవ్ ఠాగూర్ అసాధారణ ప్రతిభ కలిగిన రచయిత, ఆలోచనాపరుడు, కవి అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆయన ఒక గొప్ప తత్వవేత్తగా, విద్యావేత్తగా, కళాకారుడిగా, దేశ నాగరికతా ఆత్మకు కాలాతీత స్వరంగా తనదైన ముద్ర వేశారని కొనియాడారు.

మానవత్వంలోని లోతైన భావోద్వేగాలకు, మన సంస్కృతిలోని అత్యున్నత ఆదర్శాలకు ఆయన ఒక రూపమిచ్చారని శ్రీ మోదీ తెలిపారు. నూతన ఆలోచనలతో, సృజనాత్మక శక్తితో, సాంస్కృతిక విశ్వాసంతో ఆయన మన సమాజాన్ని సుసంపన్నం చేశారని అన్నారు.

దేశం ఠాగూర్‌ను ఎంతో గౌరవంతో, కృతజ్ఞతతో స్మరించుకుంటోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు మన మనసులను నిరంతరం ప్రకాశింపజేయాలని, మన ప్రయత్నాల్లో మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

"నేడు పోచిషే బోయిషాఖ్ ప్రత్యేక సందర్భంలో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు మేం హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాం.

గురుదేవ్ ఠాగూర్ అసాధారణ ప్రతిభ కలిగిన రచయిత, ఆలోచనాపరుడు, కవి. ఆయన ఒక విశిష్టమైన తత్వవేత్తగా, విద్యావేత్తగా, కళాకారుడిగా, దేశ నాగరికతా ఆత్మకు కాలాతీత స్వరంగా తనదైన ముద్ర వేశారు. మానవాళి ప్రగాఢమైన భావోద్వేగాలకు, మన సంస్కృతిలోని అత్యున్నత ఆదర్శాలకు ఆయన ఒక రూపాన్ని ఇచ్చారు. నూతన ఆలోచనలు, సృజనాత్మక శక్తి, సాంస్కృతిక విశ్వాసంతో ఠాగూర్ మన సమాజాన్ని సుసంపన్నం చేశారు.

ఆయన్ను మనం ప్రగాఢమైన భక్తిశ్రద్ధలతో స్మరించుకుందాం. ఠాగూర్ ఆలోచనలు మనసులను ప్రకాశవంతం చేస్తూ, మన ప్రయత్నాలలో మనకు మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నా".

# క్వాంటం.. ఏఐ.. భవిష్యత్ సాంకేతికతలలో శరవేగంగా భారత్ పురోగమనం

న్యూఢిల్లీ, మే 9:కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, సెమికండక్టర్లు సహా డీప్-టెక్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల రంగంలో భారత్ 'శరవేగంగా' పురోగమిస్తున్నదని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర, (స్వతంత్ర బాధ్యత) ప్రధానమంత్రి కార్యాలయ, సిబ్బంది-ప్రజా సమస్యలు-పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష మంత్రిత్వ శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దీంతో వికసిత భారత్-2047 సాకారంలో యువత సారథ్యం వహించనుందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని వడోదరలోగల పారుల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ రోజు 'లక్ష్య-2047' భవిష్యత్ నైపుణ్య కేంద్రంతోపాటు కెడావరిక్ సెంటర్, అత్యాధునిక మెడికల్ సిమ్యులేషన్ సదుపాయాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు.

ఏఐ, సెమికండక్టర్లు, సైబర్ భద్రత, క్వాంటం సాంకేతికత వంటి అత్యాధునిక పరిజ్ఞానాలతో ఉన్నత విద్యను అనుసంధానించే దిశగా ప్రభుత్వ విస్తృత కృషిని మంత్రి వివరించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ), ఎథ్నోటెక్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రచురణాలయం-అంచనాల సంస్థ సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ఇక్కడ అంతర్జాతీయ గుర్తింపు పొందిన ధ్రువీకరణలతో 9 భవిష్యత్ సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు శిక్షణ లభిస్తుందని ఆయన చెప్పారు. జాతీయ క్వాంటం మిషన్ కింద దేశం సాధించిన ప్రగతిని వివరిస్తూ- భారత్ కేవలం మూడేళ్లలోనే 1,000 కిలోమీటర్ల సురక్షిత క్వాంటం కమ్యూనికేషన్ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. అంచనా కాలపరిమితిలో సగం కన్నా తక్కువ వ్యవధిలోనే ఈ గమ్యం చేరగలిగిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్ల లక్ష్యం వైపు 4 థీమాటిక్ హబ్‌లు, దేశవ్యాప్తంగాగల సంస్థల సహకారంతో ద్వారా వేగంగా దూసుకెళ్తోందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన 'ఇండియా ఏఐ మిషన్', కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటాసెట్‌లు-ఆవిష్కరణలు సహా భవిష్యత్ నైపుణ్యం వగైరాల చుట్టూ బలమైన వ్యవస్థను సృష్టిస్తోందని మంత్రి అన్నారు. ఆవిష్కరణల పరంగా అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ట ఇనుమడిస్తున్నదని చెప్పారు. అంకురావరణ వ్యవస్థ పరంగా దేశం నేడు ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని, అంతేగాక లక్షకు పైగా పేటెంట్లను నమోదు చేసిందని, వాటిలో అధికశాతం భారతీయులు దాఖలు చేసినవేనని ఆయన అన్నారు. అలాగే శాస్త్రవిజ్ఞాన ప్రచురణల పరంగానూ భారత్ ప్రపంచ అగ్ర దేశాల జాబితాలో ఒకటిగా నిలిచిందని చెప్పారు. భారత పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపుతోపాటు విస్తృత ప్రశంసలు కూడా పొందుతున్నాయని ఆయన తెలిపారు.

సాంకేతిక పరిణామాలు... ముఖ్యంగా ఏఐ, సైబర్ భద్రత, క్వాంటం సాంకేతికతలు, సెమికండక్టర్ డిజైన్ వంటి రంగాల్లో వేగం పెరుగుతున్న నేపథ్యంలో నిరంతర నైపుణ్యాభివృద్ధి, నైపుణ్య పునశ్చరణ అత్యావశ్యకమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశ జనాభాలో దాదాపు 70 శాతం 40 ఏళ్లలోపు వారే కావడమనే జనసంఖ్య లబ్ధి మనకు సానుకూలాంశమని చెప్పారు. రాబోయే రెండుమూడు దశాబ్దాల్లో అంతర్జాతీయ నైపుణ్యం గల శ్రామిక శక్తి కూడలిగా భారత్ ఎదగడానికి ఇది కీలక అవకాశాన్నిస్తోందని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, సంప్రదాయ విభాగాలకు అతీతంగా ఆవిష్కరణలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి దిశగా సమగ్ర, సహకార విధానాన్ని అనుసరించిందని చెప్పారు. తదనుగుణంగా విద్యాసంస్థలు, అంకుర సంస్థలతోపాటు ప్రైవేట్ రంగం నుంచి మరింతగా భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన జాతీయ విద్యా విధానం-2020, జాతీయ క్వాంటం మిషన్, ఇండియా ఏఐ మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ సహా వివిధ అంకుర చేయూత కార్యక్రమాల వంటివాటిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

సార్వజనీన శాస్త్రవిజ్ఞాన పురోగమనానికి ప్రభుత్వమిస్తున్న ప్రాధాన్యాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. మహిళా శాస్త్రవేత్తలు, పాఠశాల విద్యార్థులు, షెడ్యూల్డ్ కులాలు-తెగల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. అంతేకాకుండా 'పర్స్', 'ఫిస్ట్', 'స్తుతి', టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్ వంటి పథకాల ద్వారా విశ్వవిద్యాలయాలు, యువ పరిశోధకులకు ఇస్తున్న మద్దతు యంత్రాంగాల గురించి విశదీకరించారు. దేశవ్యాప్తంగా విజ్ఞాన, పరిశోధన, మౌలిక సదుపాయాలు సహా ఆవిష్కరణ అవకాశాలను అందరికీ అందుబాటులోకి తేవడం కోసమే ఈ కార్యక్రమాలు రూపొందాయని ఆయన అన్నారు.

కృత్రిమ మేధ గురించి వివరిస్తూ- సార్వజనీనత, బాధ్యత, ప్రజా శ్రేయస్సు ప్రాధాన్య విధానాన్ని భారత్ అనుసరిస్తున్నదని మంత్రి గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన 'గ్లోబల్ సౌత్ ఏఐ సమ్మిట్'లో బాధ్యతాయుత ఏఐపై ఢిల్లీ తీర్మానానికి ఆమోదముద్ర గురించి ప్రస్తావిస్తూ- సమాజంలోని అత్యంత బలహీన-వెనుకబడిన వర్గాలకు సాంకేతికత ప్రయోజనాలు అందాలని స్పష్టం చేశారు. "కృత్రిమ మేధ వినియోగానికి తగినంత వివేచన అవశ్యం" అని వ్యాఖ్యానించారు. ఆరోగ్య సంరక్షణ, పరిపాలన, సామాజిక రూపాంతరీకరణలో నైతిక విలువలు, సమానత్వం ప్రాతిపదికగాగల కృత్రిమ మేధ శక్తిమంతమైన ఉపకరణం కాగలదని ఆయన వివరించారు.

అణు వైద్య పరిశోధన, అనువర్తనాల రూపకల్పన దిశగా భారత అణు రంగంలో మరింతగా ప్రైవేట్ భాగస్వామ్యం కోసం ప్రభుత్వం అవకాశాలు కల్పించడాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. అధునాతన ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలలో ఆవిష్కరణలతోపాటు వృత్తిపరమైన అవకాశాల విస్తరణలో ఇదొక కీలక మలుపు కాగలదని ఆయన అభివర్ణించారు.

వికసిత భారత్ స్వప్న సాకారం వైపు ప్రస్థానంలో యువత చురుగ్గా పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలు నిర్వహించుకునే 2047 సంవత్సరం నాటికి శక్తిసామర్థ్యాలు, వృత్తి నైపుణ్యాల్లో భారత యువత అగ్రస్థానానికి చేరుతుందన్నారు. ఆవిష్కరణలు, విజ్ఞానం, నైపుణ్యం గల మానవ వనరులతో భారత వృద్ధి పయనం మరింత వేగం పుంజుకునేలా వారి సామర్థ్య వికాసానికి తగిన అవకాశాల కల్పన ప్రభుత్వ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.

# నిమ్జ్ ప్రాజెక్టులో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్



మెదక్, మే 9:జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్)లో మౌలిక వసతుల కల్పన పనులను స్పీడప్ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని ఎకరాల్లో చీలేపల్లి, ముంగి, రుక్మాపూర్ శివారులో మొదటి విడతలో సేకరించిన 3240 ఎకరాల్లో చేపట్టిన మౌలిక వసతుల పనులను ఆయన పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు, ఎస్ఆర్ఆర్? సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడారు. మొదటి విడత సేకరించిన భూము లను వెంటనే స్వాధీనం పరుచుకొని కడీలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నిమ్జ్ ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూముల్లో రైతులు సాగు చేసిన పంటలను తొలగించి చెట్లు చెదారాన్ని తొలగించి గుంతలను పూడ్చివేసి చదును చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టాల్సిన పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ఐఎఫ్ఎస్‌కు హెడ్ కానిస్టేబుల్ కూతురు ఎంపిక.. ఎస్పీ నరసింహ సన్మానం

సూర్యాపేట మే 09 : సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చల్లా యాదగిరి కూతురు యామిని సివిల్స్‌లో ప్రతిభ చూపి ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ కు ఎంపికైంది. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని, కూతురు యామిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యామినిని సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమైన విధానాన్ని, శిక్షణ విధానాన్ని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మంచి స్థాయికి చేరుకోవాలని, మరిన్ని ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంక్షేమ ఆర్ఎస్ఐ సాయిరాం, నర్సింగరావు పాల్గొన్నారు.

# పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మహబూబ్‌నగర్, మే 9: రాష్ట్రంలోని రైతులు భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న పంటను గోదాంలకు తరలించాలని డిమాండ్ చేస్తూ రైతులు జడ్చర్ల కల్వకుర్తి జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రైతులకు మద్దతు పలికారు.

ఆయన మాట్లాడుతూ దాదాపు నలభై రోజులుగా రైతులు ధాన్యం, మొక్కజొన్న అమ్మకాల కోసం మార్కెట్లోనే ఉంటున్నారని పంట పండించడానికి రైతు ఎంత కష్టపడతాడో, అంతకంటే ఎక్కువ అమ్ముకోవడానికి కష్టపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా పాలనలో రైతులు రోడ్డెక్కల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు.

జడ్చర్ల మార్కెట్లో ఉన్న నలభై వేల బస్తాలు వెంటనే గోదాం కు తరలించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పంట ఎంత సాగు చేశారు. దిగుబడి మీద అంచనా లేకపోవడం,గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలు,గోదాం వంటి అంశాలపై ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# పెనుబల్లిలో ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర



ఖమ్మం, మే 9: చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామం నాయకులగూడెంలో గత మూడు రోజులుగా పెద్దమ్మ తల్లి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతోంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరలో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారు. పెద్దమ్మతల్లి, పులి రాజు వివిధ వేషధారణలతో గ్రామం మొత్తం మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. జాతరలో భాగంగా శనివారం సాయంత్రం అడవిలో నుండి నరుగులు, కర్రలను సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నిప్పుల గుండం ఏర్పాటు చేసి భక్తులు పూలు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు సర్పంచ్ రెడ్డి సుజాత తెలిపారు.

# రైతుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు




మెదక్ జిల్లా, మే 9 : మెదక్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అడిషనల్ కలెక్టర్ నగేష్‌తో సమావేశమయ్యారు. మెదక్ కలెక్టర్ సెలవులో వెళితే ఇన్చార్జిగా బాధ్యతలు ఎవరికి ఇచ్చారు చెప్పండి అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.ప్రజల కోసమే, రైతుల కోసమే పని చేస్తం.. రైతుంటేనే మీరైనా మేమైనా ఉన్నం ఇయ్యాలా.. అని మైనంపల్లి రోహిత్ రావు ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు. అధికారులు లోపాన్ని వెంటనే సవరించుకోవా లన్నారు. కలెక్టర్ తీరు మార్చుకోకపోతే బాగుండదని హెచ్చరించారు.

# చలో పరేడ్ గ్రౌండ్.. నేటి ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాలి

## -వాహనల పోస్టర్ ఆవిష్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): .ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 10 వ తేదీ ఆదివారం రోజున హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు బిజెపి శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి, సభను సక్సెస్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోజున కరీంనగర్ లోని టవర్ సర్కిల్లో ప్రధాని మోడీ సభకు తరలి వెళ్లే వాహనాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , మేయర్ కోలగని శ్రీనివాస్, కార్పొరేటర్లు , బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్ వస్తున్నారని, ఈ నేపథ్యంలో లక్షలాది మందితో ఈనెల 10 ఆదివారం రోజున సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాల్సిన బాధ్యత నాయకులు కార్యకర్తలందరిపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని కోరారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించాలనే ఆలోచనతో జిల్లా పార్టీ ఉందని, ఆ దిశలో నే అన్ని మండలాల నుండి అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని సూచించారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చే వారి కోసం రవాణా, కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామని, వాటి ని వినియోగించుకోవాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తరువాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారనీ, 3వ సారి ప్రధాని పగ్గాలు చేపట్టిన తరువాత హైదరాబాద్ తొలిసారి రాబోతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులంతా తమ అనుచరులు, టీంతో తప్పనిసరిగా పరేడ్ మైదానానికి తరలి రావాలని కోరారు.. ప్రతి ఒక్కరూ మోదీ సభకు ఆహ్వానిస్తూ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రధాని మోదీ సభ సక్సెస్ తో తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం మారిపోతుందని, రాష్ట్రవ్యాప్తంగా బిజెపి గాలి వీచే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు... ఈకార్యక్రమంలోకరీంనగర్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ రమేష్ ,ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్లు వంగల పవన్ కుమార్, కె ఏపీపీ చంద్ర తోట అనిల్, కన్న కృష్ణ, సర్దార్ బల్బీర్ సింగ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, దండు కొమురయ్య, మండల/జోన్ అధ్యక్షులు తణుకు సాయి కృష్ణ, భూమల అనిల్ కుమార్, ముత్తునూటి హరీష్ , కుంట తిరుపతి ,కొండల్ రెడ్డి ,దొంతుల రమేష్, ర్యాకం శ్రీనివాస్, బీజేపీ ఓబీసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు అడిచెర్ల , ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ,దూలం అనిల్ ,కలికోట మోహన్ కచ్చకాయల రాజు సతీష్ ,శశి , భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ కౌన్సిలర్లపై కేసులు నమోదు.. పీఎస్ ఎదుట నిరసన

జోగులాంబ గద్వాల, మే 9: ప్రశ్నించే వారిపై ప్రభుత్వం అక్రమ కేసుల పరంపర రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంది. హక్కుల సాధనకు నిలదీస్తున్న సామాన్యుడి నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఏదో ఒక రంగా ఇబ్బందులపాలు చేస్తుంది.

గద్వాల మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని కమిషనర్‌ను నిలదీసిన 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పులిపాటి వెంకటేశ్, జగదీష్, గువ్వలగోపాల్, మోహన్ యాదవ్, సంటేన్న ,చిన్న రాముడు,నరసింహ కమ్మరి సునీత గంగాళం మంజుల రాణి,లత , బీఆర్ఎస్ నాయకుడు చిత్తారి కిరణ్ పై పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, పోలీసుల తీరును నిరసిస్తూ కౌన్సిలర్లు శనివారం నిరసన తెలిపారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ చట్టబద్ధంగా జరగాల్సిన ఎన్నికను ఎన్నిక నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

# అమ్మ: సృష్టికి ఆది అక్షరం.. అనురాగానికి నిలువుటద్దం

విశ్వసృష్టిలో వెలకట్టలేని ఏకైక పదం 'అమ్మ'. కాలాలు మారినా, నాగరికతలు రూపాంతరం చెందినా, విలువల సమీకరణలు తారుమారైనా నిశ్చలంగా, నిస్వార్థంగా నిలిచే శక్తి మాతృత్వం. తల్లి అంటే కేవలం ఒక వ్యక్తి కాదు, అది ఒక అనుభూతి, ఒక అపురూప కావ్యం, సకల జీవకోటికి ప్రాణాధారమైన అమృతధార. భారతీయ సంస్కృతిలో "మాతృదేవోభవ" అని తల్లిని దైవం కంటే ముందే స్మరించుకోవడం మన సంస్కారానికి నిదర్శనం. ఆధునిక కాలంలో ప్రతి ఏటా మే నెల రెండో ఆదివారాన్ని 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం'గా జరుపుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. 2026 సంవత్సరంలో మే 10వ తేదీన ఈ వేడుకను జరుపుకుంటున్న తరుణంలో, మాతృత్వంలోని అంతరార్థాన్ని, దాని చారిత్రక పరిణామక్రమాన్ని, సమాజ నిర్మాణంలో తల్లి పోషిస్తున్న అసాధారణ పాత్రను లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాతృ దినోత్సవ మూలాలు ప్రాచీన గ్రీకు, రోమన్ సంస్కృతులలో కనిపిస్తాయి. గ్రీకులు దేవతల తల్లి అయిన 'రియా'ను ఆరాధించేవారు. అయితే, ప్రస్తుత రూపంలో ఉన్న మాతృ దినోత్సవానికి పునాదులు అమెరికాలో పడ్డాయి. సామాజిక కార్యకర్త ఆన్ రీవ్స్ జార్విస్ తల్లుల ఆరోగ్యం, పారిశుధ్యం కోసం 'మదర్స్ డే వర్క్ క్లబ్స్' నిర్వహించేవారు. ఆమె మరణానంతరం, తన తల్లి చేసిన సేవలకు గుర్తింపుగా, తల్లులందరినీ గౌరవించేందుకు ఒక రోజు ఉండాలని ఆమె కుమార్తె అన్నా జార్విస్ అవిశ్రాంతంగా పోరాడారు. ఈ ఉద్యమ ఫలితంగా 1908లో వెస్ట్ వర్జీనియాలోని గ్రాఫ్టన్‌లోని ఆండ్రూస్ మెథడిస్ట్ చర్చిలో మొదటిసారిగా అధికారికంగా ఈ కార్యక్రమం జరిగింది. అన్నా జార్విస్ పట్టుదల చూసి, 1914లో అప్పటి అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్ మే రెండో ఆదివారాన్ని జాతీయ సెలవు దినంగా ప్రకటించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ, మాతృత్వాన్ని పండగలా జరుపుకుంటున్నాయి.

భారతీయ ఇతిహాసాలు, పురాణాల పుటల్లో తల్లికి లభించిన స్థానం అనన్యం. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్న రామాయణ శ్లోకం తల్లిని, మాతృభూమిని స్వర్గం కంటే మిన్నగా ప్రబోధించింది. కౌసల్య శిక్షణలో రాముడు మర్యాదా పురుషోత్తముడిగా, జిజాబాయి మార్గదర్శకత్వంలో శివాజీ ఛత్రపతిగా, భువనేశ్వరీ దేవి ఆశీస్సులతో నరేంద్రుడు స్వామి వివేకానందగా రూపుదిద్దుకున్నారు. అంటే, ఒక వ్యక్తిని సమాజానికి ఉపయోగపడే శక్తిగా మలచడంలో తల్లి కేవలం జన్మనిచ్చే దానితో ఆగిపోకుండా, సంస్కార నిర్మాణకర్తగా నిలుస్తోంది. దేశాన్ని 'భారతమాత'గా, భాషను 'తెలుగు తల్లి'గా, ప్రకృతిని 'ప్రకృతి మాత'గా భావించే విశాల దృక్పథం భారతీయులది. ఈ క్రమంలో మాతృ దినోత్సవం మనకు పరాయి దేశపు పండుగ కాదు, మన రక్తంలోనే ఉన్న గౌరవ భావానికి ఒక నూతన అభివ్యక్తి మాత్రమే.

గణాంకాల పరంగా చూస్తే, ప్రపంచ జనాభాలో సగం ఉన్న మహిళల్లో మెజారిటీ తల్లులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మహిళల పనిగంటల్లో అత్యధిక భాగం 'అన్‌పెయిడ్ కేర్ వర్క్'



(ప్రతిఫలం లేని సేవలు) కిందకే వస్తుంది. భారతదేశంలో 2021 అంచనాల ప్రకారం 67 కోట్లకు పైగా ఉన్న మహిళా జనాభాలో, గ్రామీణ ప్రాంతాల్లోని తల్లులు వ్యవసాయంలో 30-40 శాతం శ్రమశక్తిని అందిస్తున్నారు. అయినప్పటికీ, ఇంటి పనిని ఆర్థిక కోణంలో ఎవరూ లెక్కించడం లేదు. ఒక గృహిణి చేసే వంట, ఇంటి నిర్వహణ, శిశు సంరక్షణ, వృద్ధుల సేవలను గనుక జీడీపీలో చేర్చితే, దేశ ఆర్థిక ముఖచిత్రమే మారిపోతుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. తల్లి చేసే సేవకు వెల కట్టలేము కానీ, ఆమె శ్రమకు సామాజిక గుర్తింపు కల్పించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత.

ఆధునిక శాస్త్ర విజ్ఞానం సైతం తల్లి ప్రాధాన్యతను గట్టిగా సమర్థిస్తోంది. శిశువు గర్భంలో ఉన్న సమయం నుండి తల్లి మానసిక స్థితి శిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని 'ఎపిజెనెటిక్స్' వంటి శాస్త్రాలు నిరూపించాయి. శిశువు పుట్టిన తర్వాత లభించే తల్లి స్పర్శ, పాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక భద్రతా భావాన్ని కలిగిస్తాయి. కరోనా వంటి విపత్కర కాలంలో తల్లుల పాత్ర మరింత స్పష్టమైంది. ఆసుపత్రుల్లో నర్సులుగా, డాక్టర్లుగా సేవలు అందిస్తూనే, ఇళ్లలో కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడటంలో తల్లులు కవచంలా నిలిచారు. క్లిష్ట పరిస్థితుల్లో సైతం నిబ్బరంగా ఉంటూ ధైర్యాన్ని నూరిపోసే మాతృశక్తి సమాజానికి వెన్నెముక వంటిది.

సాంకేతికత పెరిగిన నేటి యుగంలో సంబంధాల మధ్య దూరం పెరుగుతోంది. అణుకుటుంబాల సంస్కృతి, జీవనపోరాటంలో భాగంగా దూర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల తల్లిదండ్రుల పట్ల బాధ్యత తగ్గుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. పెరుగుతున్న వృద్ధాశ్రమాల సంఖ్య సామాజిక విలువల పతనానికి అద్దం పడుతోంది. మాతృ దినోత్సవం అంటే కేవలం సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం లేదా ఖరీదైన బహుమతులు ఇవ్వడం మాత్రమే కాదు. వృద్ధాప్యంలో ఉన్న తల్లికి తోడుగా నిలవడం, ఆమె ఆరోగ్య అవసరాలను గుర్తించడం, కనీసం రోజుకు కొద్దిసేపు ప్రేమగా మాట్లాడటం అసలైన గౌరవం. తల్లికి కావాల్సింది ఆర్థిక సంపద కంటే, తన సంతానం నుండి లభించే ఆత్మీయత మాత్రమే.

ప్రస్తుతం తల్లుల బాధ్యతలు ద్విగుణీకృతమయ్యాయి. ఒకవైపు ఉద్యోగాల్లో రాణిస్తూ, మరోవైపు ఇంటి బాధ్యతలను భుజాన వేసుకుంటున్న 'వర్కింగ్ మదర్స్' సంఖ్య నేడు ప్రపంచవ్యాప్తంగా 47 శాతానికి చేరింది. అయితే వీరికి కార్యాలయాల్లో తగిన మౌలిక సదుపాయాలు, ప్రసూతి సెలవులు, సమాన వేతనం వంటి అంశాల్లో ఇంకా వివక్ష ఎదురవుతూనే ఉంది. మాతృత్వాన్ని గౌరవించడమంటే, ఆ తల్లికి సామాజికంగా, ఆర్థికంగా భద్రత కల్పించడం కూడా. మహిళా చైతన్యం పెరిగిన ఈ రోజుల్లో, తల్లులకు నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం కల్పించడం, వారి అభిరుచులకు ప్రాధాన్యత ఇవ్వడం నాగరిక సమాజ లక్షణం.

తెలుగు సాహిత్యంలోనూ తల్లి ప్రేమ అజరామరంగా వర్ణించబడింది. "అమ్మంటే అంతులేని అనురాగం" అని సినీ కవులు మొదలుకొని, ఆధునిక కవుల వరకు ప్రతి ఒక్కరూ అమ్మ మనసును అక్షరబద్ధం చేశారు. గ్రామీణ జానపదాల్లో "అమ్మా అని పలికినంతలోన అఖిల పాపాలు హరియించు" అనే సందేశం మాతృత్వం పట్ల ఉన్న భక్తిని చాటుతుంది. సాహిత్యం, కళలు, విజ్ఞానం?రంగం ఏదైనా తల్లి లేనిదే మనుగడ లేదనేది సత్యం.

ముగింపుగా చెప్పాలంటే, మాతృ దినోత్సవం ఒక రోజు వేడుక కాదు, అది జీవితాంతం కొనసాగాల్సిన ఒక కృతజ్ఞతా యజ్ఞం. తల్లి త్యాగానికి మనం ఇచ్చే ప్రతిఫలం ఏదీ ఆమె రుణాన్ని తీర్చలేదు. కానీ, ఆమెను గౌరవించే సంస్కృతిని తదుపరి తరాలకు అందించడం మన బాధ్యత. 'అమ్మ' అనే అక్షరం లోని మధురిమను, ఆమె చూపించే నిస్వార్థ ప్రేమను గుర్తిస్తూ, సమాజంలో తల్లితనపు విలువను పెంపొందించుకోవాలి. ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే ఆ సమాజం సుసంపన్నంగా, సుభిక్షంగా ఉంటుంది. మాతృమూర్తులందరికీ వందనం చేయడం అంటే, సాక్షాత్తూ సృష్టికర్తకు నమస్కరించడమే. ఈ 2026 మాతృ దినోత్సవం ప్రతి ఇంట్లో ప్రేమానురాగాల మేలుకొలుపు కావాలని ఆకాంక్షిద్దాం.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి

**- టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): కొనుగోల కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యం సౌకర్యార్థం కల్పించిన సౌకర్యాలు, రైతుల దిగుబడి వివరాలు, హమాలీల గురించి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే జాప్యం చేయకుండా తూకం వేయాలని, అందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించే అవకాశం ఉందని, జాప్యం చేయకుండా తరలించాలని, మిల్లుల్లో ధాన్యం బస్తాలు త్వరగా అన్ లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మెప్మా ఏవో మిర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.



# రోడ్డు ప్రమాదంలో పెళ్ళి కొడుకు తండ్రి మృతి

జనగామ మే 9: తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కొడుకు పెళ్లి వేడుకల సందడిలో ఉండాల్సిన ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. దేవురుప్పుల మండలం బంజర తండాకు చెందిన జోగు సోమయ్య(55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

శుక్రవారం రాత్రి పెళ్లి కార్యక్రమాల కోసం ట్రాక్టర్‌లో ఫంక్షన్ హాల్‌కు కట్టెలు తీసుకెళుండగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డబ్బా కింద పడిన సోమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# పోచమ్మ వాడ ప్రభుత్వ పాఠశాలలో బోరు వేయించిన కేంద్ర మంత్రి బండి సంజయ్..

**బోర్ వెల్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ మాసం గణేష్...**

కరీంనగర్, మే 9:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణం39 వ డివిజన్ పోచమ్మవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నీటి అవసరాల కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బోరు వేయించారు. శనివారం రోజున బోర్ వెల్ ను స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ మాసం గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాసం గణేష్ మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్య ఉందనే విషయాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకు వెళ్ళగానే ఆయన వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయించారని తెలిపారు. పాఠశాల అవసరాల కోసం బోర్ వేయించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. హరీష్, ఉపాధ్యాయులు ఎం. రాజు, అంగన్వాడీ టీచర్ పద్మ, గోనెల రమేష్



,పాఠశాల సిబ్బంది, విద్యార్థినీలు, విద్యార్థులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం

**- జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జనగణనపై క్షేత్ర స్థాయి ప్రచారం, అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన 2కె వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత భారతదేశంలో జనగణన చేయడం జరుగుతుందని, మన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇది మొదటి జనగణన అని, మొదటి సారి డిజిటల్ విధానంలో ఈ జనగణన నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. స్వీయగణన అనే విధానం తొలిసారి ప్రవేశపెట్టి జనగణన ప్రక్రియలో నూతన అధ్యాయానికి నాంది పలకడం జరిగిందని పేర్కొన్నారు. మీ కుటుంబ వివరాలను స్వయంగా మీరే నమోదు చేసుకునే చేసుకునే అవకాశం స్వీయ గణన ద్వారా కల్పించారని, ఇందులో 34 ప్రశ్నలు ఉన్నాయని, కేవలం ఐదు నిమిషాల్లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం సైట్ లో మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్వీయగణన చేయడానికి రేపే (ఆదివారం) తుది గడువు అని, స్వీయ గణనలో పాల్గొని వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సోమవారం నుండి జనగణన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించడం జరుగుతుందని అన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందని వెల్లడించారు. వారికి ప్రత్యేక ఐడీ కార్డులు కూడా జారీ చేశామని, ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించాలని కోరారు. జనగణన పేరుతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ఇంటికి వచ్చి వివరాలు అడిగే అవకాశం ఉంటుందని, అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. జనగణనలో పాల్గొనే సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డుల మీద క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే అధికారిక వెబ్ సైట్ లో పొంది ఉంచిన వారి పూర్తి వివరాలు వస్తాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, జనగణనలో భాగస్వామ్యులు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసా చారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా అధికారులు అఫ్జల్ బేగం, సౌజన్య, లక్ష్మీరాజం, స్వప్న, తహసీల్దార్ జయంత్, మెప్మా ఏవో మిర్జా ఫసహత్ అలీ బేగ్, ఎస్ ఓ సంపత్, జనగణన సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బంద్ అట్టర్ ప్లాప్.!!

**బిఆర్ఎస్ బంద్ పిలుపును ప్రజలు, వ్యాపారస్తులు పరిగణలోకి తీసుకోలే.**

**..బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**

కరీంనగర్, మే 9:(నేటినిజం ప్రతినిధి) కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్





కుమార్ పైహుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన గొడవను నిరసిస్తూ బిఆర్ఎస్ పిలుపునిచ్చిన కరీంనగర్ బంద్ కు ఆదరణ కరువైందని , బి ఆర్ ఎస్ పిలుపును, విజ్ఞప్తిని ప్రజలు వ్యాపారస్తులు కనీసం పరిగణలోకి తీసుకోకపోవడంతో బంద్ అట్టర్ ప్లాప్ అయిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ , కార్పొరేటర్లు, బిజెపి శ్రేణులతో కలిసి కరీంనగర్ లోని పలు ప్రాంతాల్లో పర్యటించి , వర్తక వ్యాపారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారంతా ఓహోటల్ వద్ద టీ సేవించారు. అనంతరం గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి చేయడం బీజేపీ కార్యకర్తల ఉద్దేశం కానేకాదనీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో కట్టిన క్యాంప్ ఆఫీసులో అభివృద్ధి గురించి మాట్లాడాలనీ అందుకు భిన్నంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసి ,బూతులు తిట్టడం ఎంతవరకు కరెక్ట్.. అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును రాజకీయ వేదికగా మార్చుకుని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కేంద్ర మంత్రి అనే గౌరవం లేకుండా అసభ్యకరంగా మాట్లాడడంతోనే గొడవ జరిగిందని వివరించారు. అసలు ఈ వివాదానికి మూల కారకుడు కేటీఆర్ అని, ఇటీవల కేటీఆర్ కరీంనగర్ పర్యటనకు వచ్చినప్పుడు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై అనవసర వ్యాఖ్యలు, ఆరోపణలు చేసి వివాదాన్ని సృష్టించారని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ 48 గంటల్లో కేటీఆర్ చేసిన ఆరోపణలు నిరూపించాలని ,ఆ ఆ

# కరీంనగర్ బంద్ విజయవంతం..

**- ప్రజలకు, నేతలకు చల్ల హరిశంకర్ కృతజ్ఞతలు**

కరీంనగర్, మే 9:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగర బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు నగర పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బంద్‌కు కరీంనగర్ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారని ఆయన పేర్కొన్నారు.రైతులు, కార్మికులు, వివిధ వ్యాపార, ట్రేడ్ అసోసియేషన్లు, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని తమ వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసి బంద్‌కు మద్దతు తెలిపినట్లు చెప్పారు.బంద్‌ను విఫలం చేస్తామని ముందుగా ప్రకటనలు చేసిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈరోజు ప్రజల్లో కనిపించలేదని విమర్శించారు. బంద్‌కు లభించిన అపార ప్రజా మద్దతును చూసి వారు మౌనం పాటించాల్సి వచ్చిందన్నారు.కాంగ్రెస్, బీజేపీ కలిసి బంద్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, కరీంనగర్ ప్రజలు వారి కుట్రలను తిప్పికొట్టి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. నగర ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ బంద్ నిర్వహించామని, ప్రజలు ఆ విషయాన్ని అర్థం చేసుకుని సంపూర్ణ సహకారం అందించారని అన్నారు.బంద్ సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచే బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.ఎన్ని అరెస్టులు చేసినా, ఎంతమందిని అడ్డుకున్నా ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపారని, అధికార పార్టీ బెదిరింపులకు భయపడకుండా బంద్ విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, కరీంనగర్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com